# స్వాతంత్ర్య సమర ఆంధ్ర వీరవనితలు

యాతగిరి శ్రీరామ నరసింహారావు

ఎమెస్కో

**స్వాతంత్ర్య సమర ఆంధ్ర వీరవనితలు**

**యాతగిరి శ్రీరామ నరసింహారావు**

సంపాదకుడు

**డా. డి. చంద్రశేఖర రెడ్డి**

ముద్రణ : **సెప్టెంబరు, 2016**

మూల్యం : రూ. **40/-**

కవర్ డిజైన్ : **జి. పురుషోత్త్ కుమార్**

ప్రింటర్స్ : **రైతునేస్తం ప్రెస్,** హైదరాబాద్.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్ ప్రై. లి.**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500029. తెలంగాణ.
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

పంపిణీదారులు
**సాహితి ప్రచురణలు**
29-13-53,
కాళేశ్వరరావు రోడ్డు, సూర్యారావు పేట,
విజయవాడ-2. ఆంధ్రప్రదేశ్.
ఫోన్ : 0866-2436643
e-mail: sahithi.vja@gmail.com
www.sahithibooks.com

**ముళ్లపూడి సూర్యనారాయణ**
స్వాతంత్ర్య సమరయోధుడు

## ఆంధ్రదేశంలో స్వాతంత్ర్యసమరయోధులు

ఆంధ్రదేశంలో జాతీయోద్యమంలో పాల్గొని జైళ్లకి వెళ్లిన మహిళా స్వాతంత్ర్య సమరయోధులను గురించి ఆంధ్రులకు పరిచయం చేయటానికి శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావు చాలా శ్రమించి సమాచారం సేకరించారు – ఆయన ఆంధ్రకేసరి యువజన సమితి స్థాపించి తద్వారా ఇతర ప్రముఖ కార్యక్రమాలు చేపట్టడమేగాక స్వాతంత్ర్య సమరయోధులకు సత్కార కార్యక్రమం నిర్వర్తిస్తూంటారు. సమరయోధులు ఉపయోగించిన వస్తుసేకరణ కూడా చేసి వారి స్మృత్యర్థం భద్రపరచి, చాలా శ్రమించి, తన పరిచయాలను వుపయోగించి స్వాతంత్ర్య సమరయోధుల భవన నిర్మాణం పాల్ చౌక్‌లో చేయించారు. ఆ పాల్ చౌక్‌లోనే రాజమహేంద్రి మహిళా స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలు ప్రతిష్ఠాపన చేయించారు. బిపిన్ చంద్రపాల్ 1907 ప్రాంతంలో బ్రిటిషు ప్రభుత్వ వ్యతిరేక విధానాలు చండాడుతూ రాజమండ్రిలో వుపన్యసించారు – ఆయన గౌరవార్థం అప్పటినుంచి ఆ మైదానం పాల్ చౌక్‌గా పిలువబడుతుండటమేగాక మనలో స్వాతంత్ర్యపోరాట స్మృతులను తట్టి మేల్కొలుపుతుంది. ఈ పాల్ చౌక్‌లోనే మరో వైపున స్వాతంత్ర్య సమరయోధుల భవన నిర్మాణం ఆయన కృషివల్లనే జరిగింది.  ఆ విధంగా శ్రమించి స్వాతంత్ర్య సమరయోధుల స్మృతులకు శాశ్వతరూపం కల్పించటానికి ఆయన చేసిన కృషికి ధన్యవాదాలు.

సమరయోధుడుగా ఆయనకు నా అభివందనాలు అందిస్తున్నాను.

**మండలి బుద్ధప్రసాద్**
ఉపసభాపతి
ఆంధ్రప్రదేశ్ శాసనసభ

# నేటి తరానికి వన జాగృతి

భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగువారిది ప్రముఖ పాత్ర. పురుషులతో పాటు స్త్రీలు కూడా రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని దేశం నుండి పారద్రోలడానికి అసమాన త్యాగాలు చేశారు మహాత్మాగాంధీ ప్రశంసలకు పాత్రులయ్యారు.


186 మంది వీర వనితలు స్వాతంత్ర్య సమరాంగణంలో వీరోచితంగా పోరాడారు. వారి వివరాలను సేకరించి, సంగ్రహంగా వారి పరిచయాల్ని శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావు గారు ఈ గ్రంథం ద్వారా తెలుగు జాతికి అందిస్తున్నారు.

శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావు జాతీయవాది. దేశభక్తుడు, గాంధేయవాది. తెలుగు జాతి ప్రాభవాన్ని చాటడానికి రాజమహేంద్ర వరాన్ని కార్యభూమిగా చేసుకుని అనేక కార్యక్రమాలను వయోభారాన్ని, అనారోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా నిర్వహిస్తుంటారు. ఆంధ్రకేసరి యువజన సమితి స్థాపన ద్వారా టంగుటూరి ప్రకాశం పంతులుగారి ఆశయాలను సాకారం చేస్తున్నారు. విద్యా సంస్థలు నెలకొల్పి విజయవంతంగా నిర్వహిస్తున్నారు. స్వాతంత్ర్య సమరాంగణంలో చైతన్యవంతమైన పాత్ర పోషించిన రాజమహేంద్ర వరంలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలతో స్మారక భవనాన్ని, గ్రంథాలయాన్ని నిర్మింప చేశారు. తమ మహోన్నత వారసత్వాన్ని భావితరాలు అందిపుచ్చు కోవాలని, సేవా నిరతిని, దేశాభిమానాన్ని వారిలో పెంపొందించాలని నిరంతరం శ్రీ నరసింహారావు తపన పడుతుంటారు. వారి లక్ష్య సాధనలో భాగమే ఈ పుస్తక రచన. ఈ పుస్తకం చదివి యువత ఉత్తేజితులు కావాలి. ఈనాడు మనం స్వతంత్ర భారతావనిలో స్వేచ్ఛావాయువులు

పిల్చుకుంటున్నాము. ఆనాటి పరిస్థితి వేరు. పారతంత్ర్యంలో వారెన్ని బాధలు పడ్డారో, కారాగారవాసంలో ఎన్ని కష్టాలు అనుభవించారో ఈ పుస్తకం మనకు తేటతెల్లం చేస్తుంది. వారు లోకోత్తర మహత్తర సత్యాగ్రహ పోరాటాలతో సాధించి మన చేతికిచ్చిన స్వరాజ్యాన్ని "సురాజ్యం"గ తీర్చి దిద్దుకోవటం నేటి తరం యొక్క గురుతర బాధ్యత. మన కర్తవ్యాన్ని ఈ పుస్తకం గుర్తు చేస్తుంది.

శ్రీ యాతగిరి వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను.

అభినందనలతో.....



**మండలి బుద్ధప్రసాద్**

**డా॥ పి. చిరంజీవినీ కుమారి**
ప్రధానకార్యదర్శి
తూర్పుగోదావరి జిల్లా చరిత్ర, సంస్కృతి, సామాజిక
విషయాల అధ్యయన సంస్థ – కాకినాడ

## స్వాతంత్ర్య సమరంలో వీరవనితలు – ఒక ప్రస్తావన

భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధానుయోధుల సంఖ్యలో పోరాట పటిమ కలిగి తమ సమస్తము అర్పించి జైళ్ళ పాలైన వీరవనితల సంఖ్య తక్కువేమి కాదు. శ్రీమతి సరోజినీ నాయుడు మొదలుకొని దువ్వూరి సుబ్బమ్మ వంటి మహిళా యోధులు స్వాతంత్ర్య పోరాటంలో ప్రథమశ్రేణిలో నిలిచారు.

స్వాతంత్ర్య పోరాట చరిత్రని అనేక చరిత్రకారులు అధ్యయనం చేసారు. గ్రంథాలు రచించారు. కానీ ఉద్యమంలో మహిళా యోధుల పాత్రని ఎత్తి చూపించి, వారి స్థానాన్ని భారతదేశ చరిత్రలో, అందునా, ముఖ్యంగా, ఆంధ్రదేశ చరిత్రలో స్థిరపరిచిన వారు శ్రీ యాతగిరి శ్రీరామ నరసింహారావుగారు.

యాతగిరివారు చరిత్రలో ప్రతి కోణాన్ని దేశభక్తి దృష్టితో చూడగలిగినవారు. చరిత్రాత్మకమైన ప్రతి అంశాన్ని సామాజిక దృక్పథంతో పరిశీలించగలవారు. అందుచేతనే ఆంధ్రప్రదేశంలో స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రను పరిశీలించడంలో ఆ ప్రాంతపు వీరవనితలకు ప్రత్యేకమైన స్థానం ఉన్నదని ఈ గ్రంథం ద్వారా నిరూపించారు.

ఆంధ్రదేశంలో "స్వాతంత్ర్య సమర ఆంధ్ర వీరవనితలు" అనే గ్రంథాన్ని శ్రీ నరసింహారావుగారు అత్యంత ప్రయాసతో అటు శ్రీకాకుళం నుండి నెల్లూరు, హైదరాబాదు, నల్గొండ మొదలైన జిల్లాల వరకూ,

సమాచారాన్ని సేకరించి తయారు చేసారు. ప్రతి జిల్లాకు గల ప్రాముఖ్యం, నైసర్గిక స్వభావం, రాజకీయ చైతన్యం, స్వాతంత్ర్య పోరాటావేశాన్ని జోడించి ఆయా జిల్లాలలో గల స్వాతంత్ర్య మహిళా పోరాట యోధుల సమాచారాన్ని సేకరించారు. ఈగ్రంథంలో అపురూపమైన చరిత్ర మెరుపులు మహిళా పోరాట యోధుల జీవిత గమనంలో కనబడతాయి.

శ్రీకాకుళం జిల్లా శశిమాను గున్నమ్మ అటవీ చట్టాలను ధిక్కరించే సమయంలో ఆమె గర్భిణి. ఆమెను బ్రిటిష్ ప్రభుత్వం కాల్చి చంపింది. ఆనాటి నుండి ఆమె నివాసమైన "మందస" గ్రామాన్ని వీరగున్నమ్మ గ్రామంగానే పిలుస్తున్నారు. విజయనగరం జిల్లాలో టేకుమళ్ళ అనే ఒక కుటుంబం నుంచి నలుగురు మహిళలు పోరాటం చేస్తూ జైలుకు వెళ్ళారు. తూర్పుగోదావరి జిల్లా నుండి భార్యా భర్తల జంటలు కాశీభట్ల వేంకట రమణమ్మ, లక్ష్మీ నరసింహా రావులు, పాలకోడేటి శ్యామలాంబ, సూర్యప్రకాశరావులు జమిలి జైలుకెళ్ళడం అపూర్వమేగా. 1932లో సరోజినీ నాయుడు అధ్యక్షతన ఢిల్లీలో బ్రిటిషువారి అరాచకాలను నిరసిస్తూ జరిగిన సభలో వేదాంతం కమలాదేవి అరెస్టు అయ్యారు. దేశబాంధవి సుబ్బమ్మగారి గురించి తెలియనివారు లేరు. ఆమె విధవ. ఒకసారి ఒక పోలీసు "మా పాలన ఎలా ఉన్నది అని అడిగితే తన తలమీద ఉన్న గుడ్డను తీసి ఇదిగో ఇలా ఉన్న"దని అన్నదట. ధీరురాలు, మహిళాస్ఫూర్తికి ఆదర్శప్రాయము అయిన శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ కథ స్వాతంత్ర్య పోరాటంలో ఒక అధ్యయనమే. పశ్చిమగోదావరి జిల్లాలో అమ్మన్నరాజా 1937లో ఎమ్.ఎల్.ఎ., ఆంధ్ర యూనివర్సిటి సెనెట్ మెంబరు మరియు ఉమ్మడి మద్రాసు రాష్ట్ర సభ ఉపసభాపతి. కృష్ణాజిల్లాలో అనేకమంది మహిళా యోధులలో 'మాలపల్లి' నవల రాసిన ఉన్నవ లక్ష్మీనారాయణగారి భార్య ఉన్నవ లక్ష్మీబాయమ్మ, బసవరాజు అప్పారావుగారి భార్య రాజ్యలక్ష్మి వంటివారు ఎందరో ఉన్నారు. ప్రకాశం జిల్లాలో 1921, 1922 సంవత్సరములలో శ్రీమతి కోట సుందరమ్మ పన్ను నిరాకరణ ఉద్యమంలో పన్ను కట్టుటకు ఒప్పుకోలేదు. అప్పుడు ఆ వూరి తహసిల్దార్ ఆమె మంగళ సూత్రాన్ని పన్నుగా జమకట్టుకున్నాడు. నెల్లూరు జిల్లాలో పొణకా కనకమ్మ గ్రంథాలయ ఉద్యమంలో చురుకైన

పాత్ర వహిస్తే, తిక్కవరపు సుందరమ్మ హరిజనోద్యమంలో నాయకురాలు. నల్గొండ జిల్లాలో ఆరుట్ల కమలాదేవి ప్రముఖ కమ్యూనిష్టు యోధురాలు. మల్లు స్వరాజ్యం ఉభయ వామపక్షాలకు నాయకురాలు. హైదరాబాదులో సంగం లక్ష్మీబాయిగారు, పద్మజానాయుడు వంటివారు దేశప్రతిష్ఠను ఇనుమడించినవారు ఎందరో ఉన్నారు.

ఆంధ్రదేశంలో వీలైనంత సమాచారాన్ని స్వాతంత్ర్య సమర యోధులలో స్త్రీల చరిత్రను శ్రీ నరసింహారావుగారు సంపాదించి, ఈ గ్రంథంలో పొందుపరిచారు. చరిత్ర పరిశోధకులకు ముఖ్యంగా భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను అధ్యయనం చేయగోరే రిసెర్చ్ స్కాలర్‌లకు మహిళా యోధుల పోరాట చరిత్ర, ఒక కొత్త కోణంలో ఈ గ్రంథంలో దొరుకుతుంది.

స్త్రీల దృక్పథంలో చరిత్రని అధ్యయనం చేయగోరే ఇటీవలి తరంలోని స్త్రీవాద విద్యార్థులకు అపురూపమైన సమాచారాన్ని ఈ గ్రంథం అందిస్తూంది. భారత స్వాతంత్ర్య పోరాటం పైన, ఆంధ్రదేశంలో అపారమైన త్యాగాలు చేసిన స్వాతంత్ర్య పోరాట యోధులపైన వచ్చిన గ్రంథాలలో శ్రీ నరసింహారావుగారి గ్రంథం ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నది.

ఈ గ్రంథం ప్రాతిపదికపై విస్తారమైన అధ్యయనాలు చేసి ఎంతో సమగ్రంగా జాతీయోద్యమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ మహిళా యోధుల సంపూర్ణ చరిత్రను వెలువరించే బాధ్యత చరిత్రకారులకు ఈ గ్రంథం గుర్తుచేస్తుంది.

## ఈ పుస్తకం గురించి...

భారత స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో స్త్రీలు, పురుషులు త్యాగాలుచేసారు. దేశమాత దాస్యశృంఖలాలను త్రెంచుటకు కొందరు త్యాగాలు చేసారు. ఇందులో మహిళలు కూడా ఎన్నో కష్టనష్టాలు అనుభవించారు. మహాత్మా గాంధీ పిలుపునందుకొని ఉద్యమంలోకి దుమికారెందరో. ఆయా ప్రాంతాలలో స్థానిక నాయకులు తమ ఉపన్యాసాలతో ఉత్రూతలూగించారు.

ఈ వీరుల సాహస గాధలను, త్యాగాలను, నిక్షిప్తం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అమెరికా, తదితర దేశాలలో స్వాతంత్ర్యోద్యమ చరిత్రలను ఎప్పుడో భద్రపర్చారు. ఆ దిశగా భారతదేశం పయనించింది. దేశ వ్యాప్తంగా ఉన్న సమర వీరుల చరిత్రను, ఆయా సంఘటనలు సాధ్యమైనంతవరకు పొందుపర్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో దాదాపు అన్ని రాష్ట్రాలలో సమరవీరుల సంగ్రహ జీవితాలను సేకరించి గ్రంథస్థం చేసారు, ఐతే ఆ వీరుల ఛాయాచిత్రాలను స్వీకరించక పోవడం తప్పిదమే. ఇప్పటికే చాలా సమయం వృథా అయింది. ఇప్పటికైనా ప్రభుత్వం పూనుకొని కొన్ని ఫోటోలనయినా సేకరించుట మంచిది.

నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమరవీరుల చరిత్రలను సేకరించి, 3 గ్రంథాలను ప్రచురించింది. సంతోషం. కొన్ని తప్పులు కూడా దొర్లాయి. ఉదాహరణకు రాజమండ్రిలో శివరాజు సుబ్బమ్మ వీరవనిత, ఆమె భర్త డాక్టరు రామారావు కూడా సమరవీరుడేనని ప్రభుత్వ గ్రంథంలో ఉంది. నిజానికి సుబ్బమ్మ గారి కుమారుడు డాక్టరు రామారావు. ఆయనే స్వాతంత్ర్య సమరవీరుడు. ఆ విషయంపై ఆ వాల్యూమ్ ఎడిటరైన డా॥ రేగానిని ప్రశ్నించగా జిల్లాలనుండి వచ్చిన సమాచారాన్ని

ప్రకటించామంతే అన్నారు. కొన్ని కేంద్రకారాగారంనుండి, వ్యక్తులనుండి వచ్చిన సమాచారం అది. సబ్‌జైల్స్ నుండి సమాచారం లేనేలేదు. ఖచ్చితంగా కొంతమంది వీరుల చరిత్రలు కాలగర్భంలో కల్సిపోయాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఏజన్సీ నాయకుడు కొండపల్లి సుబ్బారెడ్డిని (ఎర్నగూడెం) ఆంగ్ల ప్రభుత్వం కాల్చిచంపి, ఆ తోలుసంచిని రాజమండ్రి తీసుకొని వచ్చి కోటగుమ్మం వద్ద నుండిన వటవృక్షానికి తలక్రిందులుగా వేలాడదీసి, ప్రజలను భయభ్రాంతులను చేసారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొంటే ఇదే గతి పడుతుందని చెప్పడమన్న మాట. తర్వాత అప్పట్లో ఉండిన మున్సిపల్ మ్యూజియం (గుండ్రని స్థంభాలున్న భవనం)లో ప్రదర్శించారు. నా చిన్నప్పుడు నేనా అస్థిపంజరాన్ని అక్కడి మ్యూజియంలో చూసాను.

కొన్ని జిల్లాల సమరవీరుల సంఘాలవారు జిల్లా సమరచరిత్ర సంకలనాలను ప్రకటించారు.

స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళలు 186 మంది పాల్గొన్నారంటే ఆశ్చర్యకరమేకదా! బహుశా ఏ రాష్ట్రంలోనూ ఇంతమంది స్త్రీలు ఆ మహోద్యమంలో పాల్గొనలేదేమో. ఒక్క గుంటూరు జిల్లాలోనే 89 మంది మహిళలు వీరోచిత పోరాటాలు చేశారు. ఆంధ్ర సమరాంగనల పేర్లను, సంగ్రహ చరిత్రలను తెలియజేయడం మంచిదని ఒక ప్రయత్నం చేసాను. ఆయా జిల్లాల మహిళామండలులలో ఈ సంకలనాన్ని చదివి, గర్వించాలని, పిల్లలకు తెల్పాలని కోరుతున్నాను.

నాటి ఆంధ్రప్రదేశ్‌లో ఏ నగరంలోనూ 12 మంది మహిళలు స్వాతంత్ర్య సమరంలో జైళ్ళకు వెళ్ళలేదు. ఒక్క రాజమహేంద్రికే ఆ గౌరవం దక్కింది. అలాగే ఏ జిల్లాలోనూ అంతమంది స్త్రీలు జైళ్ళకు వెళ్ళలేదు. ఒక్క గుంటూరు జిల్లాలోనే అటువంటి చరిత్ర జరిగింది.

**యాతగిరి శ్రీరామ నరసింహారావు**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | శ్రీకాకుళం జిల్లా సమరయోధులు | 13 |
| 2. | విజయనగరం జిల్లా సమరయోధులు | 16 |
| 3. | విశాఖపట్నం జిల్లా సమరవీర వనితలు | 18 |
| 4. | తూర్పుగోదావరి జిల్లా సమరవీర వనితలు | 20 |
| 5. | పశ్చిమ గోదావరి జిల్లా సమరవీర వనితలు | 31 |
| 6. | కృష్ణా జిల్లా సమరవీర వనితలు | 38 |
| 7. | గుంటూరు జిల్లా సమరవీర వనితలు | 43 |
| 8. | ప్రకాశం జిల్లా సమరయోధులు | 53 |
| 9. | నెల్లూరు జిల్లా సమరయోధులు | 55 |
| 10. | అనంతపురం జిల్లా సమరయోధులు | 59 |
| 11. | వరంగల్లు జిల్లా సమరయోధులు | 59 |
| 12. | చిత్తూరు జిల్లా సమరయోధులు | 60 |
| 13. | హైద్రాబాదు జిల్లా సమరయోధులు | 61 |
| 14. | నల్గొండ జిల్లా సమరయోధులు | 64 |

# శ్రీకాకుళం జిల్లా సమరయోధులు

## శ్రీకాకుళం జిల్లా నైసర్గిక స్వరూపం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 3 విభాగాలు ఉన్నాయి, ఉత్తరాంధ్రలో 3 జిల్లాలు – శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం. తూర్పుగా ఒడిస్సా రాష్ట్రానికానుకుని ఉన్న జిల్లా శ్రీకాకుళం, కళింగాంధ్రలో మొదటి జిల్లా. ఒకప్పుడు గంజాం జిల్లాలో ఉండేది. ఒకవైపు సముద్రం మరోవైపు ఎక్కువ అటవీప్రాంతం, నాగావళి, వంశధార నదులు. అందువల్ల ఎక్కువ ప్రాంతం సస్యశ్యామలం అయింది. 1960 దశకంలో ఒక నాయకుడు తన ఇద్దరు పుత్రికలకు ఆ నదుల పేర్లు పెట్టడం అందర్నీ ఆశ్చర్య పరిచింది. దశావతారాలలో, కూర్మావతారం ఇక్కడే వెలసింది. అదే శ్రీకూర్మం. సుమారు వందశాసనాలున్నాయి. మాఘపాదివారంనాడు సూర్యకిరణాలు అరసవిల్లి లోని గర్భాలయంలో సూర్యుణ్ణి తాకడం విశేషం. వంశధార నదీ తీరంలోని శ్రీముఖలింగాలయం శిల్పమయం. గారదిబ్బపై బౌద్ధారామం ఉంది. శ్రీకాకుళంలోని పెద్దమశీదు ఒకనాటి శివాలయం, కాళీపట్నం రామారావు (కారామేష్టారు) గారి 'కథా నిలయం' అపురూపమైనది. అది శ్రీకాకుళంలో ఉంది. తురుష్కుల కాలంలో చిక్కకోల్ ఒక ముఖ్య రాజకీయ కేంద్రం. శాసనసభల స్పీకర్లుగా పనిచేసిన శ్రీ రొఖం లక్ష్మీ నరసింహం దొర, ప్రతిభాభారతి ఈ జిల్లాకు చెందిన వారే. రాజకీయ చైతన్యం ఎక్కువగా నున్న జిల్లా. పలాస జీడిపప్పుకు ప్రసిద్ధి. శ్రీకాకుళానికి 4 కి.మీ. లోని కళ్ళేపల్లివద్ద నాగావళి, 20 కి.మీ.లోని కళింగపట్నం వద్ద వంశధార సముద్రంలో కలుస్తుంది.

మిక్కిలి వెనుకబడిన జిల్లా అయినప్పటికీ 329 మంది పురుషులు స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడం విశేషం. ప్రక్కనే ఒడిస్సా రాష్ట్రంలోని బరంపురం ప్రభావం ఈ జిల్లాపై పడింది. ఐదుమంది మాత్రమే స్త్రీలు ఇక్కడ ఉద్యమంలో కారాగార

శిక్షపొందారు. అందులో శిష్టాచార కుటుంబాలనుండి నల్గురు పాల్గొన్నారు. అందులో కప్పగంతుల ఆదిలక్ష్మి హరిజనాభ్యుదయ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనడం విశేషమే మరి. శశిమాను గున్నమ్మ రైతు కుటుంబంనుండి వచ్చారు. ఆమె గర్భిణి అయినప్పటికీ, పోలీసులు కాల్చిచంపారు. శ్రీకాకుళం జిల్లావాసి గరిమెళ్ళ సత్యనారాయణ గారు అనేక పర్యాయాలు జైళ్లకు వెళ్లడమే గాక ఆయన రచించిన "మా కొద్దీ తెల్లదొరతనమూ" అన్న 39 పంక్తుల దీర్ఘ గేయం దేశాన్ని ఉర్రూత లూగించింది. జీవితమంతా కడుదారిద్ర్యాన్ని అనుభవించి, చెన్నై హోటల్ ముందు అడుక్కుంటూ ఆఖరి శ్వాస విడిచారు. మరో నాయకుడు సర్దారు గౌతులచ్చన్న బడుగు వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కష్టపడిన, గొప్ప ఫాలోయింగు ఉన్న నాయకుడు. ఉద్యమంలో పాల్గొని ఎన్నో పర్యాయాలు జైలు జీవితాన్ని అనుభవించారు. అధికార, ప్రతిపక్షాలలో నాయకత్వ స్థానాలలో ఉన్నవారు. ఈ ఇద్దరి వల్లా శ్రీకాకుళం జిల్లాకు మంచి పేరు వచ్చింది.

## శ్రీకాకుళం జిల్లాలో స్వాతంత్ర్య సమర ఆంధ్ర వీరవనితలు

### 1. కప్పగంతుల ఆదిలక్ష్మి

శ్రీకాకుళం వాస్తవ్యులు రామేశం గారి ధర్మపత్ని. శాసనోల్లంఘన, హరిజనాభ్యుదయం, ఖాదీప్రచారం, విదేశీ వస్త్రదహనం, లిక్కరుషాపులకు వ్యతిరేకంగా ప్రదర్శన చేశారు. ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. శిక్షల ననుభవించారు.

### 2. దువ్వాడ బాలకృష్ణమ్మ

మందసా వాసి. మందసా ఎస్టేట్ రైతుల ఉద్యమంలో పాల్గొని, 1940లో ఒక సంవత్సరం కఠినకారాగార శిక్షననుభవించారు.

### 3. శశిమాను గున్నమ్మ

మందసా వాసి, ఎస్టేట్ రైతుల ఉద్యమానికి నాయకత్వం వహించడమే గాక ప్రభుత్వాధికారుల అనైతిక దుశ్చర్యలను ఖండించారు. అటవీచట్టాలను ధిక్కరించే సమయంలో ఎదురొడ్డిన గర్భిణి గున్నమ్మను పోలీసులు కాల్చి చంపారు. నాటినుండి ప్రజలా గ్రామాన్ని 'వీరగున్నమ్మపురం'గా పిలువ సాగారు.

## 4. హెచ్. సత్యభామాబాయి

శ్రీకాకుళం వాసి సుబ్బారావు గారి భార్య. 1940లో వ్యక్తి సత్యాగ్రహం చేసి, వెల్లూరు, కడలూరులలో కఠినకారాగార శిక్షననుభవించారు.

## 5. జయంతి సూరమ్మ

టెక్కలి తాలూకా అనంతగిరి వాసి కొండూరు సీతారామయ్యగారి పుత్రిక, వెంకటనారాయణ గారి భార్య. 1920–30 మధ్యకాలంలో విదేశీవస్తు బహిష్కరణోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని, 19–6–1930 నుండి 6 నెలలు వెల్లూరు జైల్లో శిక్షపొందారు. శాసనోల్లంఘ నోద్యమంలో పాల్గొని, వెల్లూరు, కడలూరు కారాగారాల్లో 18–1–1932 నుండి 15 నెలలపాటు కఠిన శిక్షపొందారు. గాంధీజీ నిర్దేశించిన నిర్మాణ కార్యక్రమంపై దృష్టిపెట్టారు.

# విజయనగరం జిల్లా సమరయోధులు

## జిల్లా ప్రత్యేకతలు

విజయనగరంలో ఒకే ఇంటిపేరు – టేకుమళ్ళ వారి కుటుంబంలో నల్గురు స్త్రీలు జైళ్ళకు వెళ్ళారు. శ్రీకాకుళం జిల్లా నుండి కొంతభాగం, విశాఖ జిల్లానుండి కొన్ని భాగాలతో విజయనగరం జిల్లా ఏర్పడింది. మహారాజులు ఎందరో పండితులను, కవులను, కళాకారులను ప్రోత్సహించారు. మహాకవి గురజాడ అప్పారావు నడయాడిన నగరం. వారు నివసించిన గృహాన్ని రాష్ట్రప్రభుత్వం పదిలపర్చి గ్రంథాలయాన్ని నిర్వహిస్తోంది. జిల్లాలోని రామతీర్థం ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం. అక్కడున్న కొండపై బౌద్ధ అవశేషాలున్నాయి. శ్రీ కె.ఎస్. తిలక్ స్వాతంత్ర్యోద్యమ నాయకుడు. మహారాజు పి.వి.జి. రాజు గొప్ప సోషలిస్టు నాయకుడు. వెనుకబడిన జిల్లా, సహకారోద్యమం వేళ్ళూనింది. ఒకవైపు సముద్రం.

### 1. మంత్రిప్రగడ బంగారమ్మ

భర్త నరసింహం పంతులు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, 13–6–1930 నుండి ఏడున్నర మాసాలు వెల్లూరు జైల్లో కఠిన శిక్షననుభవించారు. 1948లో మరణించారు.

### 2. టేకుమళ్ళ బుచ్చిరామాయమ్మ

భర్త సీతారామస్వామి. తండ్రి ఉప్పులూరి నరసింహం. శాసనోల్లంఘ నోద్యమంలో 6 నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళలో శిక్ష ననుభవించారు.

### 3. ద్వారకా భమిడిపాటి మహాలక్ష్మమ్మ

1905లో బరంపురంలో జన్మించారు. విజయగరంలో రామదీక్షితులు గారి భార్య. 1932లో శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, శిక్షననుభవించారు.

## 4. టేకుమళ్ళ మహలక్ష్మమ్మ

జననం విజయనగరంలో 1902లో. సీతారామస్వామి గారి భార్య. 1932లో శాసనోల్లంఘనోద్యమంలో శిక్షపొందారు. 1944లో మరణించారు.

## 5. టేకుమళ్ళ సీతారామమ్మ

జననం విజయనగరంలో 1909లో. భర్త వరాహ నరసింహం. 15-1-1932 నుండి 4 నెలలపాటు శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నందుకు వెల్లూరు జైల్లో శిక్షననుభవించారు.

## 6. టేకుమళ్ళ వరాహలక్ష్మి

విజయగరంలో నరసింహమూర్తి గారి భార్య. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందున, వెల్లూరు జైల్లో 6 నెలలు శిక్ష ననుభవించారు.

## 7. భానగరపు అనసూయమ్మ

జననం 1909 ఆగష్టు. విజయనగరంలో మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేసిన డాక్టరు సంజీవరావు గారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో జైలు శిక్షపొందారు.

# విశాఖపట్నం జిల్లా సమరవీర వనితలు

## జిల్లా ప్రత్యేకతలు

దిమిలి గ్రామంలో ఒకే ఇంటిపేరు - శిష్టా కుటుంబంలో నల్గురు స్త్రీలు జైలుకు వెళ్ళారు. శ్రీశ్రీ, ఆరుద్రల జన్మస్థలం ఇదే! ఆ స్థలాలను సందర్శించే భాగ్యం నాకు కల్గింది. స్వాతంత్ర్యోద్యమం శ్రీ తెన్నేటి విశ్వనాథం నాయకత్వంలో దిగ్విజయంగా జరిగింది. విశాఖనగరం తప్ప మిగిలినది వెనుకబడినదే. రాజరాజనరేంద్రుని కుమారుడు కులోత్తుంగుడు విశాఖనగరాన్ని నిర్మించినట్లు చరిత్ర. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖజిల్లాలను కళింగాంధ్రము అంటారు. సింహాచలం ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం. ఒక వైపు సముద్రం.

### 1. మిస్సుల లక్ష్మీనర్సమ్మ

యలమంచిలి సమీపంలోని దిమిలి గ్రామవాసి శిష్టా రామమూర్తి కుమార్తె, భర్త వీరవెంకట సత్యనారాయణ. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నందుకు 26-1-1932 నుండి 6 నెలలపాటు వెల్లూరు, కన్ననూరు జైళ్లల్లో శిక్ష ననుభవించారు.

### 2. శిష్టా లక్ష్మీనర్సమ్మ

దిమిలి గ్రామవాసి. పురుషోత్తంగారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 5-10-1942 నుండి 3 నెలల పాటు కఠినకారా గారవాసాన్ననుభవించారు.

**3. శిష్ట్లా లింగమ్మ**

1881లో ఉప్పు సత్యాగ్రహంలోను, 1932లో శాసనోల్లంఘనోద్యమంలోను, 1942లో క్విట్టిండియా ఉద్యమంలోను పాల్గొని, కఠిన కారాగార శిక్షల ననుభవించారు.

**4. కాల్నాధభట్ల మహాలక్ష్మమ్మ**

యలమంచిలి వాసి జోగారావు గారి భార్య. మిస్సుల దీక్షితులుగారి కుమార్తె. ఉప్పు, శాసనోల్లంఘన, వ్యక్తి, క్విట్టిండియా ఉద్యమాలలో పాల్గొని, వెల్లూరు, కడలూరు జైళ్ళల్లో కఠిన శిక్ష పొందారు. - 1967 లో తమ 76వ ఏట పరమపదించారు.

**5. గాదె నారాయణమ్మ**

యలమంచిలి దరి మంగవరంలో పేర్రాజుగారి భార్య. తండ్రి బి. యర్రయ్య. 1932లో శాసనోల్లంఘనోద్యమంలో కఠినకారాగార శిక్షననుభవించారు.

**6. శిష్ట్లా సోదెమ్మ**

దిమిలి వాసి కామేశ్వరరావు గారి భార్య. 1940లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని, శిక్షపొందారు.

**7. శిష్ట్లా శ్యామసుందరమ్మ**

దిమిలి వాసి రామదాసు గారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, 11-12-1942 నుండి 3 నెలలు కఠినకారాగార శిక్షననుభవించారు.

**8. దర్భా వేంకటరమణమ్మ**

అనకాపల్లి వాసి హనుమంతరావు గారి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 16-2-1932 నుండి నాల్గునెలల పాటు కఠిన శిక్ష ననుభవించారు.

# తూర్పుగోదావరి జిల్లా సమరవీర వనితలు

## జిల్లా ప్రత్యేకతలు

దేశంలో ఏ నగరంలోను 12 మంది మహిళలు స్వాతంత్ర్య సమరంలో పాల్గొని, శిక్షలననుభవించ లేదు. రాజమహేంద్రిలో కాశీభట్ల వేంకటరమణమ్మ, మద్దూరి వేంకటరమణమ్మ, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, దువ్వూరి సుబ్బమ్మ, బారు అలివేలమ్మ, చేబియ్యం సోదెమ్మ, పెద్దాడ కామేశ్వరమ్మ, గూడూరి నాగరత్నమ్మ, గుజ్జు నాగరత్నమ్మ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, శివరాజు సుబ్బమ్మ, పాలకోడేటి శ్యామలాంబ గారలు సమరవీర వనితలు. రాజమహేంద్రి టి. నగర్‌లో ఒక పార్కులో ఆంధ్రకేసరి యువజన సమితి వీరి విగ్రహాలను నెలకొల్పి, సంగ్రహజీవిత చరిత్రలను ఉల్లేఖించింది. అదే ఫ్రీడం పార్కు. నిత్యం దేశవిదేశీయులు ఈ పార్కును సందర్శిస్తున్నారు. ఇదే పాల్‌చౌక్. వందేమాతరం ఉద్యమంలో బిపిన్‌చంద్రపాల్ ఇక్కడ 1907 ఏప్రిల్ 19 నుండి 23 వరకు ఉపన్యసించినందుకు పాల్‌చౌక్‌గా పిలువబడుతున్నది. నెదర్లేండ్‌కి చెందిన యువపరిశోధకురాలు అన్నా కెరెన్నా ఇంతమంది స్త్రీలు ఎందుకిక్కడ జైలుకెళ్ళారు అన్నది పరిశోధనాంశం అన్నారు.

ఇక్కడ 2 అంతస్తుల భవనాన్ని నిర్మించుకున్నాం. స్వాతంత్ర్య సమరవీరుల చిత్రాలతో ఫోటో గ్యాలరీ, స్వాతంత్ర్య సమగ్రచరిత్ర గ్రంథాలతో గ్రంథాలయం, ఆ వీరులు వాడిన వస్తువులతో మ్యూజియం ఉన్నవి. ఇలాంటి భవనం దేశంలో మరెక్కడా లేదు.

'పద్మవిభూషణ్' బిరుదుపొందిన స్వాతంత్ర్యసమర వీరవనిత – ఆంధ్రప్రదేశంలో ఒకే ఒక్కరు – దుర్గాబాయ్ దేశ్‌ముఖ్.

'దేశసేవిక' బిరుదాన్ని పొందిన వేదాంతం కమలాదేవి కాకినాడ వాసి, 'దేశబాంధవి' బిరుదాన్ని పొందిన దువ్వూరి సుబ్బమ్మ రాజమహేంద్రి వాసియే.

జవహర్‌లాల్ నెహ్రూ మరణవార్తను జీర్ణించుకోలేక, నిరాహారదీక్షచేసి 5వ రోజున దేహత్యాగంచేసిన వీరవనిత – దువ్వూరి సుబ్బమ్మ.

భార్యాభర్తలిరువురూ జంటగా మున్సిపల్ కౌన్సిలర్లుగా వెడుతుండేవారు, అలాంటి రెండు జంటలు రాజమహేంద్రిలో జైలుకెళ్ళారు. వారే కాశీభట్ల వేంకట రమణమ్మ, లక్ష్మీనరసింహారావు, పాలకోడేటి శ్యామలాంబ, సూర్యప్రకాశరావు గారలు–

మద్దూరి వేంకటరమణమ్మ, భర్త అన్నపూర్ణయ్య మరిది కృష్ణమూర్తి, తమ్ముడు కె.ఎస్. శాస్త్రి సమరవీరులే.

జిల్లాలో గోదావరి తీరంలో సీతానగరంలో ఆశ్రమం ఉంది. మహర్షి బులుసు సాంబమూర్తి, డాక్టరు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం గారల నాయకత్వం జిల్లా అదృష్టం. జిల్లాలో సీతానగరం, వాడపల్లి ప్రసిద్ధ స్వాతంత్ర్యోద్యమ క్షేత్రాలు. సీతానగరంలో గౌతమీ సత్యాగ్రహాశ్రమాన్ని డాక్టరు సుబ్రహ్మణ్యం నెలకొల్పి, ఎందరో యువకులను సమరానికి సమర్పించారు. 1929, 33లలో గాంధీజీ దీన్ని సందర్శించారు. వాడపల్లి రథం మీద గాంధీజీ చిత్రాన్ని పెట్టి ఊరేగిస్తుండగా పోలీసు కాల్పులు జరిపారు.

జిల్లాలో ద్రాక్షారామం ప్రసిద్ధ శైవక్షేత్రం. పంచారామాల్లో ఒకటి. త్రిలింగ క్షేత్రాలలో ఒకటి. అష్టాదశశక్తిపీఠాలలో ఒకటి. సుమారు 200 శాసనాలున్నాయి. అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం దినదినాభివృద్ధిగాంచుతోంది. అంతర్వేది ప్రసిద్ధమైన వైష్ణవ క్షేత్రం, పిఠాపురం పాదగయా క్షేత్రం.

కోరుకొండ సమీపంలోని కాపవరం కొండపై బౌద్ధగుహలున్నాయి. ఇవి రాష్ట్రప్రభుత్వ పురావస్తుశాఖ అధీనంలో ఉన్నాయి. రాజోలు సమీపంలోని ఆదుర్రులో బౌద్ధస్తూపాన్ని కేంద్రపురావస్తుశాఖ పరిరక్షిస్తోంది. జిల్లాకు ఒకవైపు సముద్రం.

రాజమహేంద్రిలోని 11వ శతాబ్దానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా ఉండే భాగ్యం నాకు దక్కింది. గుండువారి వీథిలో ప్రాచీన జైన మందిరముంది. గౌతమీ గ్రంథాలయం ప్రక్కన సిక్కుల 'గురుద్వారా' ఉంది. ప్రాచీన చర్చికూడా ఉంది. మతసామరస్యం ఇక్కడ ఎక్కువ.

## 1. బారు అలివేలమ్మ



బారు అలివేలమ్మ

జననం 1897 సెప్టెంబరు. మరణం 13-11-1973. భర్త రాజారావు, పెద్దకుమారుడు గోవిందరావులు కూడా స్వాతంత్ర్య సమరవీరులే. 1930లో అలహాబాదులో కమలా నెహ్రూ, తదితరులతో విదేశీ వస్త్రదహనోద్యమంలో పాల్గొని శిక్షపొందారు. భర్త శ్రీ రాజారావు రాజమండ్రి శాసనసభ్యునిగా 1937లో పనిచేశారు.

కుమారులు : వెంకట గోవిందరావు, కృష్ణారావు.

కుమార్తెలు : శేషగిరమ్మ, శారద, శాంత.

## 2. సింహాద్రి అన్నపూర్ణాదేవి

భర్త శ్రీ సత్యనారాయణ, శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 4 నెలలు కారాగార శిక్షననుభవించారు.

## 3. గుమ్మిడిదల దుర్గాబాయమ్మ



దుర్గాబాయ్ దేశ్‌ముఖ్

రాజమహేంద్రిలో కంభం వారి సత్రం వీథిలో కాంద్రేగుల జమిందారు గారింట 15-7-1909న జన్మించారు. తండ్రి బి.వి.ఎన్ రామారావు. భర్త డా. చింతామణి దేశ్‌ముఖ్. దుర్గాబాయమ్మ ఎం.ఏ., బి.ఎల్., చేసారు. గాంధీజీ పిలుపు మేరకు చిన్నతనంలోనే స్వాతంత్ర్యోద్యమంలోకి దుమికారు. 1923లో కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సభలలో ప్రవేశ పత్రం లేనందున జవహర్ లాల్ నెహ్రూను వలంటీరుగా లోనికి ప్రవేశించుటకు వీలులేదని ధైర్యంగా చెప్పగల్గింది. మద్రాసులో ఉప్పు సత్యాగ్రహంలో ప్రకాశంపంతులు గారితో పాల్గొని, శిక్షననుభవించారు.

1932లో కూడా జైలు కెళ్ళారు. మహిళలకు హిందీ, ఖద్దరు వడకడంలో శిక్షణనిచ్చింది. మహిళాభ్యుదయ కార్యక్రమాలకు నాయకత్వం వహించారు. రాజ్యాంగ పరిషద్, ప్లానింగు కమీషనులలో సభ్యురాలుగా ఉండేవారు. సెంట్రల్ సోషల్ వెల్ఫేరు బోర్డు ప్రథమ అధ్యక్షురాలు. జాతీయ మహిళా విద్యా కమిటీకి తొలి అధ్యక్షురాలు. 1971లో దేశంలో అక్షరాస్యతా ఉద్యమ నాయకురాలుగా నెహ్రూ నేషనల్ లిటరసీ అవార్డు పొందారు. 1975లో పద్మవిభూషణ్ బిరుదు వీరిని వరించింది. ఢిల్లీ, మద్రాసు, హైద్రాబాదులలో ఆంధ్ర మహిళా సభల వ్యవస్థాపకురాలు.

9-5-1981 న మరణించారు.

## 4. పందిరి జగదాంబ

1919 ఏప్రిల్‌లో పర్లాకిమిడిలో జన్మించారు. కాకినాడ వాసి డాక్టరు ఎం.వి. వీరయ్య కుమార్తె. 1940లో యుద్ధవ్యతిరేక ప్రచారంలో డిటైన్ అయ్యారు, కార్మికోద్యమంలో కూడా పాల్గొన్నారు. 1947లో రాజమండ్రి మున్సిపల్ కౌన్సిలరుగా ఎన్నికయ్యారు.

## 5. వేదాంతం కమలాదేవి

కడపజిల్లా నందలూరులో 5-5-1897న జన్మించారు. కాకినాడలో ప్రతాపగిరి గోపాలకృష్ణయ్యగారి కుమార్తె. డాక్టరు వెంకటకృష్ణయ్య గారి భార్య. కలకత్తాలో ఇంగ్లీషు, బెంగాలీ నేర్చుకున్నారు. సంఘసేవకురాలుగా, రాజకీయవాదిగా ప్రఖ్యాతినందారు. 1920లో గాంధీజీ పిలుపుమేరకు సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. 1923లో కాకినాడ కాంగ్రెసులో లేడీ కమాండెంట్‌గా వ్యవహరించారు. ఆంధ్రదేశం అంతటా విస్తృతంగా పర్యటించి ఖాదీ ప్రచారం చేసారు. తిలక్ స్వరాజ్య నిధికి విరాళాలు వసూలు చేసారు. పక్షవాతంతో బాధపడుతూ విశాఖ జిల్లా అంతటా పర్యటించి, స్త్రీలను ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనమని ప్రబోధించారు. 21-5-1930 నుండి 6 నెలలు వెల్లూరు జైలులో శిక్షపొందారు. 1931లో ఇచ్ఛాపురంలో జరిగిన మహిళా మహాసభకి అధ్యక్షత వహించారు. సరోజినీ నాయుడు అధ్యక్షతన ఢిల్లీలో జరిగిన మహాసభలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టే

విధంగా ప్రసంగించినందుకు 22-6-1932 నుండి 6 నెలలు వెల్లూరు జైల్లో శిక్షననుభవించారు. 3 సార్లు కాకినాడ మున్సిపల్ కౌన్సిలర్‌గా సేవలందించారు. 'దేశసేవిక' బిరుదాన్ని పొందారు.

1940 జూలై 14న స్వర్గస్థులయ్యారు.

## 6. పెద్దాడ కామేశ్వరమ్మ



పెద్దాడ కామేశ్వరమ్మ

రాజమహేంద్రిలో 15-5-1907న జన్మించారు. తల్లిదండ్రులు పెద్దాడ వేంకట సుబ్బమ్మ, సుందర శివరావు. ప్రొఫెసరు బి. కుప్పుస్వామిగారి భార్య. ఉపాధ్యాయినిగా ఉద్యోగం చేస్తుండగా, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 31-3-1931 నుండి 6 నెలల పాటు వెల్లూరు జైల్లో శిక్షపొందారు. పెద్దాపురం తోటలో నాయకుల సమావేశాన్ని రహస్యంగా నిర్వహించారు. పోలీసులు విపరీతంగా లాఠీలతో కొట్టారు. మైసూరు మున్సిపల్ కౌన్సిల్లో తొలి మహిళా కార్పోరేటరుగా పనిచేస్తూ, పాకీపని వారికి సంఘాన్ని పెట్టారు. తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెసుకు ఎన్నికైన తొలి మహిళా అధ్యక్షురాలు. ఏ.ఐ.సి.సి. సభ్యురాలు. 29-7-1979న మరణించారు. వీరి సోదరి బత్తులపల్లి రాజ్యలక్ష్మి. సోదరులు సీతాపతిరావు, పాపారావు.

## 7. మానుగంటి లక్ష్మీనర్సమ్మ

కాకినాడ వాసి లక్ష్మీకాంతరావు గారి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 11-9-30 నుండి 7-3-1931 వరకు వెల్లూరు జైల్లో శిక్షపొందారు.

## 8. మానాప్రగడ రామసుందరమ్మ

సీతానగరం వాస్తవ్యురాలు. తండ్రి కనకయ్య. భర్త వెంకట కృష్ణారావు. 1926 లో నిర్మాణ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించారు. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 16-1-33 నుంది 6 నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళల్లో శిక్షననుభవించారు.

## 9. భమిడిపాటి రంగనాయకమ్మ

కాకినాడ వాసి వేంకట్రామయ్యగారి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 18-1-32 నుండి 6 నెలలు కఠిన కారాగారశిక్ష ననుభవించారు.

## 10. రాచర్ల సామ్రాజ్యం

రాజమహేంద్రిలో 26-4-1919న జన్మించారు. గోపరాజు వేంకట కృష్ణారావు గారి కుమార్తె. సీతానగరంలో రామచంద్రరావు గారి భార్య. హిందీలో రాష్ట్రభాష, విశారద, వార్థాసేవాగ్రాంలో బేసిక్ విద్యపై హిందూస్థాన్ నయీతాలీమ్ శిక్షణను పొందారు. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, 25-4-1944 నుండి 6 నెలలపాటు వెల్లూరులో కఠినశిక్ష ననుభవించారు. కస్తూరిబా జాతీయ స్మారక నిధి, సీతానగరం ఆశ్రమంలో వివిధ హోదాలలో పనిచేశారు.

## 11. దువ్వూరి సుబ్బమ్మ


దువ్వూరి సుబ్బమ్మ

దక్షారామంలో 1880 నవంబరులో జన్మించారు. మల్లాది సుబ్బావధాని గారి కుమార్తె. కడియంలో దువ్వూరి వెంకయ్యగారి భార్య. 1920లో సహాయనిరాకరణోద్యమంలో దేశంలో పాల్గొన్న రెండవ మహిళ. 4-4-22 నుండి సంవత్సరంపాటు రాజమండ్రి జైలులో కఠిన శిక్షననుభవించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, 31-5-1930 నుండి 6 నెలలు కఠిన కారాగార శిక్షననుభవించారు. భారత, భాగవత, రామాయణాలను ఉల్లేఖిస్తూ తమ గంభీరోపన్యాసాలతో ప్రజలను ఉత్రూతలూగించారు. 1942లో క్విట్టిండియా ఉద్యమంలో పెద్దాపురంలో లాఠీ దెబ్బలను తిన్నారు. 16 సంవత్సరాలు ఏ.ఐ.సి.సి.లో సభ్యురాలు. రాజమండ్రిలో స్త్రీ సనాతన విద్యాలయాన్ని నిర్వహించారు. జైల్లో కలెక్టరు బ్రేకను సుబ్బమ్మగారిని నోటితోనైనా క్షమార్పణ కోరమనగా, తన కాలు వేరైనా క్షమార్పణ కోరదని ధైర్యంగా చెప్పారు. 1923లో కాకినాడ కాంగ్రెసు 'దేశబాంధవి' బిరుదాన్నిచ్చింది. గాంధీజీచే పలుమారులు ప్రశంసలు

పొందినవారు. కడియంలో పంచాయతీకి, ఆలయ నిర్మాణానికి స్థలాన్ని దానం చేసారు. 27-5-1964లో జవహర్ లాల్ మరణవార్తను విన్నవెంటనే ఆహారవిసర్జన చేసి 31-7-1964లో రాజమండ్రిలో ప్రాణత్యాగం చేసారు.

## 12. తల్లాప్రగడ విశ్వసుందరమ్మ



తల్లాప్రగడ
విశ్వసుందరమ్మ

జననం 6-3-1899. మరణం 30-8-1949. భీమవరం సమీపంలోని ఉండి గ్రామంలో యల్లవరపు సీతమ్మ, శ్రీరాములు గార్ల ప్రథమ సంతానం. ఉంగుటూరుకు చెందిన తల్లాప్రగడ నరసింహశర్మగారితో, తన 9వ ఏటనే వివాహం చేసుకున్నారు. వీరి సోదరులు డాక్టరు వేంకట కృష్ణారావు, విశ్వేశ్వర రావు కూడా సమరవీరులే. శ్రీ కృష్ణారావు మద్రాసు మాజీ మంత్రి. విశ్వేశ్వరరావు కవి. 1923లో రాజమండ్రి ఆర్యాపురంలో ఆనందనికేతన ఆశ్రమాన్ని భర్తతో కల్సి నిర్వహించారు. అస్పృశ్యతానివారణ, స్త్రీ జనాభ్యుదయం, నూలువడకడం వంటి నిర్మాణ కార్యక్రమాలకు అది నిలయమైంది. వెల్లూరు జైలులో కఠినశిక్ష పొందారు.

చాగల్లు ఆశ్రమాన్ని నిర్వహించారు. 125 గీతాలతో కవితాకదంబం ప్రచురించారు. తన శక్తిని సమయాన్ని సంఘ సంస్కరణకు, దేశసేవకు వినియోగించారు. కొంత కాలం వీరేశలింగం పంతులుగారి వితంతు శరణాలయాన్ని నడిపారు.

## 13. ఎస్. సుభద్రమ్మ



ఎస్. సుభద్రమ్మ

కాకినాడ వాసి రమణయ్యాచారి పుత్రిక. చట్ట ఉల్లంఘనోద్యమంలో పాల్గొని 20-4-1932 నుండి సంవత్సరం పాటు వెల్లూరు, మధురై జైళ్ళలో కఠిన శిక్షపొందారు.

## 14. పాలకోడేటి శ్యామలాంబ



పాలకొండేటి
శ్యామలాంబ

జననం 12-6-1902. మరణం 18-6-1953. దుగ్గిరాల వియన్నగారి కుమార్తె, సూర్యప్రకాశరావుగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో 2-5-1932 నుండి 7 నెలలు శిక్షపొందారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని, వెల్లూరు జైల్లో 6-1-1941 నుండి 6 నెలల శిక్షపొందారు. 1946-53 మధ్య భర్త స్వాతంత్ర్య సమరవీరుడు శ్రీ సూర్యప్రకాశ రావుతో కల్సి మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలకు హాజరయ్యేవారు. వీరి బావగారు డాక్టరు గురుమూర్తి కూడా స్వాతంత్ర్యసమరవీరులే. రాజమండ్రి మున్సిపల్ ఛైర్మన్‌గా సేవలందించారు.

## 15. కాశీభట్ల వేంకటరమణమ్మ



కాశీభోట్ల
వేంకటరమణమ్మ

15-4-1912న జన్మించారు. చీమలకొండ సూర్యనారాయణశాస్త్రిగారి కుమార్తె. భర్త డాక్టరు లక్ష్మీనరసింహారావు కూడా స్వాతంత్ర్య సమర వీరుడు, రాజ్యసభ సభ్యుడు. ఉభయులు 1938లో రాజమండ్రి మున్సిపల్ కౌన్సిలర్స్‌గా ఉండేవారు. శాసనోల్లంఘనోద్యమంలో శిక్షననుభవించారు. రామచంద్రపురం సబ్‌జైలులో కుమారుని ప్రసవించింది. ఆయనే డాక్టరు రామలింగశాస్త్రి. రాజమహేంద్రిలో టి. నగరులో అగ్రవర్ణాలమధ్య తమ స్వగృహంలో గాంధి హరిజన విద్యార్థినుల వసతి ఏర్పాటుచేసారు ధైర్యంగా. కుమార్తెలు వితాల మాణిక్యాంబ, సుసర్ల భానుమతి, మైలవరపు భారతి, తీగవరపు విజయలక్ష్మి. రామలింగశాస్త్రి, సూర్యనారాయణశాస్త్రి కుమారులు.

## 16. మద్దూరి వేంకటరమణమ్మ

పెద్దాపురంలో 2-3-1906న జన్మించారు. భర్త మద్దూరి అన్నపూర్ణయ్యతో కల్సి సీతానగరం గౌతమీ సత్యాగ్రహాశ్రమంలో ఉండేవారు. 26-1-1932న



మద్దూరి
వెంకటరమణమ్మ

విదేశీవస్త్రదుకాణాల వద్ద పికెటింగు చేసారు. 27-1-1932 నుండి 6 నెలలు వెల్లూరు, కన్ననూరు కారాగారాల్లో కఠిన శిక్షననుభవించారు. భర్త జైలులో ఉన్నప్పుడు 6-1-1943న మరణించారు. వీరి సోదరులు స్వాతంత్ర్య సమరవీరులు శ్రీ కె.ఎస్. శాస్త్రి విశాఖలో ఉన్నారు. కుమారుడు జయరామ్. కుమార్తె కొల్లూరి రాజేశ్వరి. భర్త అన్నపూర్ణయ్య గారు జైలులో ఉండగానే ఏకైక కుమార్తెకు వివాహం జరిపించారు.

## 17. గూడూరి నాగరత్నమ్మ



గూడూరి నాగరత్నం

6-7-1913న యర్నగూడెంలో జన్మించారు. 3-11-1983న రాజమహేంద్రిలో మరణించారు. భర్త శ్రీ రంగయ్య. చాగల్లు ఆశ్రమం పరిసర గ్రామాలలో 1926-32 మధ్య హరిజన, ఖద్దరు ప్రచారాలు చేసారు. 1932లో శాసనోల్లంఘ నోద్యమంలో పాల్గొని, 10 నెలలు శిక్షననుభవించారు.

## 18. గుజ్జు నాగరత్నం



గుజ్జు నాగరత్నం

నిడదవోలులో 1915 ఫిబ్రవరిలో గ్రంథి చిన వేంకటరత్నం, భ్రమరాంబలకు జన్మించారు. స్వాతంత్ర్యసమరవీరులైన శ్రీ వెంకట్రావును వివాహం చేసుకున్నారు. విదేశీ వస్త్రబహిష్కర ణోద్యమంలో డాక్టరు బ్రహ్మజ్యోస్యుల సుబ్రహ్మణ్యం గారి ఆదేశాలమేరకు రాజమండ్రి మెయిన్‌రోడ్డులో పందిరి వారి కొట్లకెదురుగా ఖద్దరు వస్త్రదుకాణాన్ని భర్తతోకలిసి ధైర్యంగా నిర్వహించారు. పట్టణంలో అనేకవీధుల్లో స్త్రీలతో తిరిగి ఖద్దరు అమ్మకం చేసారు. ఉప్పుసత్యాగ్రహం,

స్త్రీల డిక్టేటర్ల సమావేశాల్లో పాల్గొన్నందున 1932, 33 సంవత్సరాలలో ఏలూరు, గుంటూరు సబ్ జైళ్ళల్లోను, వెల్లూరు, కన్నలూరు జైళ్ళలోను 16 నెలలు కఠిన శిక్షలననుభవించారు. వైశ్యసేవా సదనంలో నూతినీటిని తోడి హరిజనులచే త్రాగించారు. వీరి కుమారులు సత్యపాల్, విశ్వేశ్వరరావు. కుమార్తెలు ప్రగళ్ళపాటి అరుణ, గుజ్జు కస్తూరి.

## 19. శివరాజు సుబ్బమ్మ


శ్రీ శివరాజు సుబ్బమ్మ

రాజమండ్రి టి. నగరులో ఉంటూ, శాసనోల్లంఘ నోద్యమంలో పాల్గొని 27-1-1932 నుండి 6 నెలలు వెల్లూరు జైలులో కఠినశిక్ష పొందారు. స్త్రీ ఖైదీలకు సత్సంగ కార్యక్రమాలు నిర్వహించేవారని, వీరితోపాటు శిక్షపొందిన హైద్రాబాదు మాజీ మంత్రి సంగం లక్ష్మీ బాయమ్మ రాసారు. శ్రద్ధానంద ఘాట్‌లో దువ్వూరి సుబ్బమ్మ గారితో కల్సి, బ్రిటిష్‌వారిని నిర్భయంగా విమర్శించేవారు. నిస్వార్థ, నిరాడంబర జీవి. నిత్యం ఖద్దరు ధరించేవారు. ఇతర ఊళ్ళలోని బంధువులు, స్నేహితుల ఇండ్లలోని వివాహాది శుభకార్యక్రమాలకు వెళ్ళినప్పుడు అక్కడ భాగవతపఠనం చేసి, అర్థం చెప్పి వారిచ్చేవస్తువులు, డబ్బును పేదవారికిచ్చి, తిరిగి చేరుకునేవారు, ఆచరణయోగ్యమైన వైరాగ్యధోరణి వారిలో ఉండేది. 1873లో వెలిచేరు కరణంగారింట జన్మించి, లక్ష్మీనారాయణను పెండ్లి చేసుకున్నారు. వీరి పెద్దకుమారుడు డాక్టరు వేంకట రామారావు కూడా సమరవీరులు. జాతీయ పాఠశాల కార్యదర్శిగా చిరకాలం సేవచేసారు. రెండవకొడుకు సూర్యప్రకాశరావు, కుమార్తె తురగా రామలక్ష్మమ్మ. 1948లో సుబ్బమ్మగారు స్వర్గస్థులైయ్యారు.

## 20. తట్టా ఆండాళమ్మ

భర్త వేంకటరాఘవాచార్యులు. రాజోలు మండలం కడలి. శాసనోల్లంఘనకు 1-2-1932 నుండి 6 నెలలు, 6 వారాల శిక్షను వెల్లూరు జైల్లో అనుభవించారు.

## 21. చేబియ్యం సోదెమ్మ



చేబియ్యం సోదెమ్మ

1895లో భీమవరంలో జన్మించారు. తండ్రి చివుకుల సూర్యనారాయణ. భర్త శ్రీ సోమయ్య తో కల్సి పోలవరంలో స్వరాజ్య ఆశ్రమాన్ని నెలకొల్పి గిరిజన గ్రామాలలో దశాబ్దకాలం పాటు అక్షరాస్యత, ఖాదీ, అస్పృశ్యతా నిర్మూలన కార్యక్రమాలను బాగా నిర్వర్తించారు. సహాయ నిరాకర ణోద్యమంలో పాల్గొన్నారు, ఉప్పు సత్యాగ్రహాలలో చురుకుగా పాల్గొని 27-1-1932 నుండి 6 నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళల్లో కఠిన శిక్షననుభవించారు. రాజమహేంద్రిలో అస్పృశ్యతానివారణ కార్యక్రమంలో పెక్కు కష్టాలు అనుభవించారు. ఇక్కడనే మరణించారు.

# పశ్చిమ గోదావరి జిల్లా సమరవీర వనితలు

## జిల్లా ప్రత్యేకతలు

ఏలూరులో ఒకే కుటుంబం – ముడుంబ – లో ఏడుగురు సమరవీరులుండే వారు. అందులో ముగ్గురు స్త్రీలు.

కవి కొవ్వలి గోపాలరావు, భార్య కనకమ్మ (తణుకు) సమరవీరులు, కవి, చిత్రకారుడు శ్రీ అడవి బాపిరాజు సమరవీరుడే. ఏలూరు దరి గుండుగొలను డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్య స్వస్థలం. ఆ గ్రామంనుండి పెక్కుమంది జైలుకు వెళ్ళారు. ఏలూరు దరి చాటపర్రులో ఒకే కుటుంబం మాగంటి వారింట్లో ఆరుగురు సమరంలో పాల్గొన్నారు.

ఏలూరులో ముడుంబ వెంకటమ్మ తన 3 నెలల పసిబాలుని తీసుకుని జైలుకి వెళ్ళారు. ఆ కుర్రవాని పేరు భారతపతాకాచార్యులు.

జిల్లాలో చాగల్లు, పోలవరంలో ఆశ్రమాలు ఉండేవి. కొవ్వూరు, ఏలూరు, భీమవరం, నర్సాపురం ప్రాంతాలనుండి సమరవీరు లెక్కువ వచ్చారు. కొండపల్లి సుబ్బారెడ్డి అను గిరిజన నాయకుడిని యర్నగూడెంలో బ్రిటిష్ వారు కాల్చిచంపి, రాజమహేంద్రి కోటగుమ్మం సమీపంలోని ఒక వటవృక్షానికి ఆ కళేబరాన్ని తలక్రిందులుగా వెళ్ళాడదీసి, ప్రజలను భయభ్రాంతుల్ని చేశారు.

విప్లవ వీరుడు అల్లూరి జన్మించిందీ జిల్లాలోనే. గాంధీజీ కొవ్వూరు ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు.

## 1. చోడగం అమ్మన్నరాజా


చోడగం
అమ్మన్నరాజా

2-6-1909న మచిలీపట్నంలో జన్మించారు. తండ్రి జి. వీరయ్యనాయుడు, ఏలూరులో జనార్ధనరావుగారిని వివాహం చేసుకున్నారు. మద్రాసులో 1933 నుండి 1936 వరకు ఉపాధ్యాయినిగా పనిచేసారు. రాజకీయాల్లోకి దిగారు. ఏలూరు నుండి 1937లో శాసన సభ్యురాలుగా ఎన్నికయ్యారు. ఆంధ్రవిశ్వ విద్యాలయ సెనేట్‌లో సభ్యత్వం పొందారు. 1940లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని 28-11-1940 నుండి సంవత్సరం పాటు కారాగారశిక్షననుభవించారు. 1946-52 మధ్య ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభలో ఉపసభాపతిగా పనిచేసారు. రాష్ట్రంలోని అన్ని స్త్రీ సంక్షేమ కార్యక్రమాల లోను చురుకుగా పాల్గొన్నారు. రాష్ట్రమహిళా విద్యామండలి అధ్యక్షురాలుగా చక్కగా పనిచేసారు. 1962-68 మధ్య రాజ్యసభ సభ్యురాలిగా చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు.

## 2. అల్లూరి అన్నపూర్ణాదేవి

పెనుమత్స వేంకట్రామరాజు పుత్రిక. సత్యనారాయణరాజుగారి భార్య. నర్సాపురం తాలూకా జిన్నూరు వాసి. కాశీపట్నం జమిందారీ రైతుల ఉద్యమంలో పాల్గొని, కారాగారశిక్షననుభవించారు. విదేశీవస్త్ర బహిష్కరణ, అస్పృశ్యతానివారణ, మధ్యనిషేధం కార్యక్రమాలలో మంచి పాత్రవీరిది. శాసనమండలి సభ్యురాలిగా పనిచేసారు. భర్త సత్యనారాయణరాజు మంత్రిగా పనిచేసారు. అన్నపూర్ణాదేవి 14-8-1977న మరణించారు.

## 3. మాగంటి అన్నపూర్ణాదేవి

ఏలూరి దరి చాటపర్రు వాసి. కలగర రామస్వామిగారి పుత్రిక. భర్త శ్రీ బాపినీడు. 1920ల్లో కలకత్తాలో విద్యనభ్యసిస్తూ, లండన్‌లో ఉన్నత విద్యకోసం వెళ్ళేసమయంలో, గాంధీగారి పిలుపుమేరకు స్వాతంత్ర్యంలోకి

దుమికారు. విదేశీవస్త్రాల షాపుల వద్ద పికెటింగు చేసారు. 1921లో గాంధీజీ ఆంధ్రదేశ పర్యటనకు విచ్చేసినప్పుడు, బంగారు వస్తువులన్నిటిని సమర్పించారు. "నాకు జ్ఞాపకమున్నంత వరకు తన అన్ని విలువైన ఆభరణాలను సమర్పించిన తొలి మహిళ అన్నపూర్ణాదేవియే" అని అన్నారు.



మాగంటి అన్నపూర్ణాదేవి

### 4. చింతపర్తి బుచ్చెమ్మ

ఏలూరు దరి గుండుగొలను వాసి. కొండా ప్రకాశరావు గారి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, వెల్లూరు జైల్లో శిక్షననుభవించారు.

### 5. దారా దమయంతీదేవి

ఏలూరు వాసి. పసుమర్తి పురుషోత్తం గారి కుమార్తె. జానకిరామ్ గారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 23-5-1932 నుండి 6 నెలలు కఠిన కారాగారశిక్షననుభవించారు.

### 6. కోటమర్తి కనకమహాలక్ష్మి

భీమవరంలో జన్మించారు. వల్లూరి లక్ష్మణసోమయాజులు గారి పుత్రిక. సూర్యనారాయణ శాస్త్రిగారి భార్య. వయస్సు పైబడినా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, వెల్లూరు జైలులో 6 నెలలు శిక్షపొందారు. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని సంవత్సరం శిక్షననుభవించారు. 1941లో వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని, 6 నెలలు శిక్షపొందారు. ఎన్నోసార్లు లాఠీ దెబ్బలు తిన్నారు. హరిజనోద్ధరణ, ఖాదీప్రచార కార్యక్రమాలలో చురుకైన పాత్ర వీరిది. చిరకాలం జిల్లా కాంగ్రేసు కమిటీల్లో ఉన్నారు.

### 7. కొవ్వలి కనకమ్మ

16-11-1898న వద్దిపర్రులో జన్మించారు. తణుకు వాసి వీరభద్రరావు గారి కుమార్తె. స్వాతంత్ర్యసమరవీరుడు, నవలాకారుడు శ్రీ కొవ్వలి గోపాలరావు భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 11-2-1931

నుండి 4 నెలలు కఠిన కారాగారశిక్షననుభవించారు. మళ్ళీ ఉద్యమంలో జేరడం వల్ల 18-1-1932 నుండి 6 నెలలు కఠినంగా శిక్షింపబడ్డారు. హరిజనోద్ధరణ, ఖాదీ ప్రచారాలలో తీవ్రంగా శ్రమించారు.

## 8. దాసరి కృష్ణవేణమ్మ

ఏలూరు వాసి రాజయ్య కుమార్తె. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, 20-7-1930 నుండి నాల్గునెలలు వెల్లూరు జైల్లో శిక్షపొందారు. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 6-1-1932 నుండి 6 నెలలు శిక్షపొందారు.

## 9. దామరాజు లక్ష్మమ్మ

ఏలూరు వాసి కారుచోటి సుబ్బయ్య కుమార్తె. లక్ష్మీపతి గారి భార్య. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, 21-7-1930 నుండి 6 నెలలు వెల్లూరులో జైలు శిక్ష పొందారు. ఏలూరు పట్టణ కాంగ్రెసు అధ్యక్షురాలిగా పనిచేసారు.

## 10. ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మ

1898లో నర్సాపురం తాలూకా ముత్యాలపల్లి గ్రామంలో చన్నాప్రగడ సుందర రామయ్యగారి కుమార్తె. కవయిత్రి, నిర్మాణకార్యకర్త. భీమవరంలో శాసనోల్లంఘనోద్యమంలో విదేశీవస్త్రదుకాణాలవద్ద పికెటింగు జరపడంవల్ల 1-11-1932 నుండి 6 నెలలు కఠినశిక్షపొందారు. 1958-66 మధ్య ఎం.ఎల్.సి., మహిళ, హరిజనోద్ధరణ కార్యక్రమాలలో బాగాపాల్గొన్నారు. బేసిక్ విద్య, హిందీ, ఖద్దరు ప్రచారాలతో తీవ్రంగా పనిచేసారు. తెలుగులో భాగవత, రమణ గీతాలను రాసారు. కస్తూరిబా ట్రస్టు జిల్లా కార్యదర్శిగా, గాంధీస్మారకనిధి ఉపాధ్యక్షురాలుగా, నెల్లూరు కస్తూరి దేవి విద్యాలయం వ్యవస్థాపకురాలుగా సేవలందించారు. 27-8-1970న మరణించారు.

## 11. ముడుంబ లక్ష్మీదేవి

4-8-1913న జన్మించారు. మరింగంటి పార్థసారథి ఆచార్యులుగారి కుమార్తె. ఏలూరు వాసి. స్వాతంత్ర్య సమరవీరుడు దొడ్డయాచార్యులు గారి ధర్మపత్ని. ఆనేక ఆయుర్వేద గ్రంథాలు రాసారు. అనేక విషయాలపై పలు వ్యాసాలు రాసినందుకు బహుమతులు వచ్చినవి. 1940 నుండి చిరకాలం

మద్రాసు ఇండియన్ మెడిసిన్ కేంద్ర సంఘ సభ్యులు. 1930లో కారాగార శిక్షననుభవించారు.

### 12. మంతెన లక్ష్మీనర్సమ్మ

తణుకు వాసి. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 3 నెలలు కారాగార శిక్షపొందారు.

### 13. శృంగారకవి లక్ష్మీనర్సమ్మ

గుండుగొలనులో 1905లో జన్మించారు. భోగరాజు వేంకట నరసింహరావు గారి కుమార్తె. పాపారావు గారి భార్య. ఏలూరు వాస్తవ్యులు. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 11-2-1931 నుండి 4 నెలలు కారాగార శిక్ష పొందారు. మరల ఉద్యమంలో పాల్గొని, 11-1-1932 నుండి 7 నెలలు శిక్షపొందారు. వ్యక్తి సత్యాగ్రహి కూడ. మున్సిపల్ కౌన్సిలర్. స్త్రీల గురించి 4 గ్రంథాలు రాసారు.

### 14. ఉద్ధరాజు మాణిక్యాంబ

నర్సాపురం తాలూకా పలమర్రు వాసి. రామరాజు గారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 27-6-1932 నుండి 10 నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళల్లో శిక్షపొందారు. పికెటింగు చేయడం వల్ల 17-4-1933 నుండి 6 నెలలు శిక్షపొందారు.

### 15. వెలమాటి మాణిక్యాంబ

ఏలూరు దరి కొవ్వలి వాసి. పాకలపాటి నాగయ్యగారి కుమార్తె, శాసనోల్లంఘనోద్యమంలో ఏలూరు సబ్‌జైలులో 15 రోజులు శిక్ష పొందారు. పికెటింగు చేయడం వల్ల 17-4-1933 నుండి 6 నెలలు శిక్షపొందారు.

### 16. కంది నాగరత్నమ్మ

ఏలూరు వాసి చుండూరి లక్ష్మీనారాయణ గారి కుమార్తె. లక్ష్మీకాన్తంగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, వెల్లూరు జైల్లో 6 నెలలు కఠినశిక్షననుభవించారు. బయటకు వచ్చిన వెంటనే పికెటింగు చేయడంవల్ల 15 రోజులు రిమాండులో ఉన్నారు. ఖాదీ, హిందీ ప్రచారానికి తీవ్రకృషి సల్పారు.

**17. పాలకోడేటి నాగరత్నమ్మ**

తాడేపల్లి గూడెం వాసి శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, వెల్లూరు కన్ననూరు జైళ్ళల్లో 29–6–1932 నుండి 10 నెలలు శిక్షను అనుభవించారు.

**18. దాట్ల నర్సమ్మ**

తణుకు వాసి నీలాద్రిరాజు గారి భార్య. 1930 ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని, 3 నెలలు శిక్షనందారు.

**19. కలగర పిచ్చమ్మ**

ఏలూరులో 10–8–1883న జన్మించారు. మాగంటి రామినీడు గారి కుమార్తె. రామస్వామిగారి భార్య 1921 నుండి ఉద్యమాలలో ఉన్న మహిళ. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 14–7–1930 నుండి 6 నెలలు వెల్లూరు జైల్లో శిక్షపొందారు. ఏలూరు పట్టణ కాంగ్రెసు అధ్యక్షురాలుగా పని చేసారు. స్త్రీ ప్రార్థనా సమాజ కార్యదర్శిగా సేవలందజేసారు. హరిజనోద్ధరణకు, మహిళా సమాజాల స్థాపనలో విశేషకృషిసల్పారు.

**20. వద్దిపర్తి శకుంతల**

ఏలూరి వాసి శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 6 నెలలు శిక్షపొందారు.

**21. కొటికలపూడి సరస్వతీదేవి**

5–3–1917న 5–3–1917లో నూజివీడులో జన్మించారు. ఏలూరు దరి పూళ్ళ నివాసం, పుల్లా సుబ్బారావు గారి కుమార్తె. ఆంజనేయలుగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 7 నెలలు వెల్లూరు, కన్ననూరు జైళ్ళల్లో శిక్షననుభవించారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని 7 నెలలు కఠిన శిక్ష పొందారు. హరిజనోద్ధరణకు ప్రాధాన్యతనిచ్చారు.

**22. వారణాసి సీతమ్మ**

భీమవరం వాసి కప్పగంతుల గున్నయ్యగారి పుత్రిక. శాసనోల్లఘనోద్యమంలో పాల్గొని 9–7–1930 నుండి 3 నెలలు వెల్లూరు జైల్లో శిక్షపొందారు.

**23. అద్దునూరి సీతారామమ్మ**

తాడేపల్లిగూడెం వాసి. గోపాలరావు గారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 10 నెలలు కారాగారశిక్ష పొందారు.

## 24. వేగేశ్న సుభద్రాదేవి

భీమవరం వాసి. వేగేశ్న పెద్దసుబ్బరాజు గారి కుమార్తె. పలాసలో జరిగిన రాష్ట్ర కాంగ్రెసు సేవాదళ శిక్షణాకేంద్రంలో శిక్షణపొందారు. క్విట్టిండియా ఉద్యమంలో రాజీనామా చేయమని మెజిస్ట్రేటుని డిమాండ్ చేసారు, ఫలితంగా 2 ఏండ్లు కఠిన కారాగార శిక్షపొందారు.

## 25. బారదవాడా సూరమ్మ

భీమవరం వాసి. కొండా నరసన్నరాజు గారి కుమార్తె. శాసనోల్లంఘ నోద్యమంలో 18-1-1932 నుండి 7 నెలలు వెల్లూరు జైల్లో కఠిన శిక్షననుభవించారు.

## 26. ముదుంబ వెంకటమ్మ

ఏలూరు వాసి. శ్రీమాన్ మరింగంటి నరసింహాచార్యులు గారి పుత్రిక. భర్త శ్రీ నరసింహాచార్యులు. జాతీయ కవయిత్రి. తన గేయాల ద్వారా ప్రజల నుత్రూతలూగించారు. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని, వెల్లూరి జైలుకు తన 3 నెలల కుమారుడిని – (భారతపతాకాచార్యులు) తీసుకుని వెళ్ళి 6 నెలలు 21-7-1930 నుండి శిక్షననుభవించారు. మరల శాసనోల్లంఘనోద్యమంలో వెల్లూరు జైలులో 30-4-1932 నుండి ఏడున్నర మాసాలు కఠిన శిక్షననుభవించారు.

## 27. గోకరాజు వెంకాయమ్మ

భీమవరం దరి జువ్వలపాలెం నివాసి. మంతెన వేంకట్రాజుగారి కుమార్తె. సూర్యనారాయణ రాజుగారి భార్య. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని, వెల్లూరు జైల్లో 15-1-1941 నుండి 6 నెలలు కఠినకారాగారశిక్షపొందారు. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొంటూ భీమవరం మేజిస్ట్రేట్‌ను రాజీనామా చేయమని డిమాండు ఫలితంగా 27-2-1943 నుండి 2 సంవత్సరాలు వెల్లూరు జైల్లో కఠిన శిక్షననుభవించారు.

జిల్లాలో ద్వారాకా తిరుమల ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం. జిల్లాకు ఒకవైపు సముద్రం.

# కృష్ణా జిల్లా సమరవీర వనితలు

## జిల్లా ప్రత్యేకతలు

దాదాపు అందరూ 1932లో శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నారు. గుడివాడ, అవనిగడ్డ, గన్నవరం తాలూకాలనుండి ఎక్కువగా పాల్గొన్నారు. నూతక్కి సీతారామమ్మ జైలులో శిశువుకు జన్మనిచ్చి, అస్వస్థురాలయింది. విజయవాడలో ఒకరు, బందరులో ఒకరు స్త్రీలు సమరంలో పాల్గొన్నారు. జిల్లాలో కమ్మకులానికి చెందిన స్త్రీలు ఎక్కువగా పాల్గొనడం విశేషం. ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు, గొట్టిపాటి బ్రహ్మయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు ప్రభృతుల ప్రభావం ఎక్కువగా ఉంది.

బెజవాడ కనకదుర్గ ఆరాధ్యదైవం. కృష్ణాతీరంలోని వేదాద్రి ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం, ముత్యాల శైవక్షేత్రం. విజయవాడ పరిసరాల్లో బౌద్ధ, జైన గ్రామాలుండేవి. జిల్లాకు ఒక వైపు సముద్రం.

### 1. మల్లిరెడ్డి అన్నపూర్ణమ్మ

గుడివాడ జనార్ధనపురం వాసి. గాదిరెడ్డి లక్ష్మారెడ్డి గారి కుమార్తె. రాఘవరెడ్డిగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో వెల్లూరు జైల్లో 16-3-1933 నుండి 10 నెలలు శిక్ష పొందారు.

### 2. సూరపునేని అన్నపూర్ణమ్మ

విజయవాడ తాలూకా గరికపర్రు వాసి. పొట్లూరు వెంకయ్యగారి పుత్రిక. నాగయ్యగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 25-3-1932 నుండి ఏడున్నర నెలలు కఠినశిక్షపొందారు.

**3. వల్లభనేని అన్నపూర్ణమ్మ**

గుడివాడ తాలూకా ఉదుటూరు వాసి. అంజయ్య గారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 31-1-1932 నుండి సంవత్సరం కఠినశిక్ష పొందారు.

**4. అట్లూరి కామేశ్వరమ్మ**

గుడివాడ సమీపంలోని నూజెళ్ళ వాసి. చలసాని కృష్ణయ్యగారి పుత్రిక. మల్లికార్జునరావు గారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 18-1-1930 నుండి సంవత్సరం శిక్షననుభవించారు.

**5. జాగర్లమూడి కామేశ్వరమ్మ**

గుడివాడ దరి వెంట్రప్రగడ వాసి. వెల్లంకి వేంకట్రామయ్యగారి పుత్రిక. బ్రహ్మానందంగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 27-6-1932 నుండి సంవత్సరం కఠిన శిక్షపొందారు.

**6. గొర్రెపాటి కుటుంబమ్మ**

1905లో జననం. దివి తాలూకా ఘంటసాల వాసి. వీరమాచనేని భూషయ్య గారి కుమార్తె. వెంకటసుబ్బయ్యగారి భార్య. హిందీ సంస్కృతం బాగా నేర్చుకున్నారు. కల్లు దుకాణాల వద్ద పికెటింగు జరపడం వల్ల 3 నెలలు కఠినకారాగార శిక్షపొందారు.

**7. చెఱుకూరి కృష్ణవేణమ్మ**

గుడివాడ తాలూకా తమిరిశ గ్రామ వాసి. శేషయ్యగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 25-6-1932 నుండి 1 సంవత్సరం కఠిన శిక్షపొందారు.

**8. గుత్తికొండ లక్ష్మమ్మ**

కృష్ణాజిల్లా వాసి. 1930 నాటి ఉప్పుసత్యాగ్రహంలో 6 నెలలు శిక్షననుభ వించారు.

**9. బొప్పన లక్ష్మీకాన్తమ్మ**

గరికపర్రు వాసి. నెప్పల్లెలో 1932 ఏప్రిల్‌లో ఉప్పుసత్యాగ్రహం జరిపినందుకు కారాగారశిక్షపొందారు.

## 10. గొర్రెపాటి లక్ష్మీకాన్తమ్మ

1903లో జననం. ఘంటసాల వాసి. వేమూరి వీరన్నగారి కుమార్తె. నరసింహం గారి భార్య. గ్రామంలో కల్లుదుకాణాల వద్ద పికెటింగు వల్ల 2-4-1933 నుండి 3 నెలలు శిక్షనందారు.

## 11. కొల్లిపర లక్ష్మీకాన్తమ్మ

గన్నవరం తాలూకా కపిలేశ్వరపురం వాసి. తాతినేని చిన్నకోటయ్య గారి కుమార్తె. వీరయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు జైల్లో 2-5-1932 నుండి 6 నెలలు శిక్షపొందారు. వ్యక్తి, క్విట్టిండియా ఉద్యమాలలో కూడా జైలుశిక్ష ననుభవించారు.

## 12. గోనుగుంట్ల లక్ష్మీకాన్తమ్మ

గుడివాడ వాసి. తుమ్మలపల్లి వెంకటనర్సుగారి పుత్రిక. వెంకట సుబ్రహ్మణ్య గుప్తగారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు జైల్లో 2-5-1932 నుండి 1 సంవత్సరం కఠిన శిక్షపొందారు. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నందున 1941లో వెల్లూరు జైల్లో 3 నెలలు శిక్ష, మరొకసారి 6 నెలలు శిక్షపొందారు. క్విట్టిండియా ఉద్యమంలో సంవత్సరం వెల్లూరు జైల్లో కఠినశిక్షనుపొందారు. గుడివాడ హరిజనబాలికల హాస్టలుకు మేనేజరుగాను, మున్సిపల్ కౌన్సిలరుగా కూడ పనిచేసారు.

## 13. కోటగిరి మంగతాయారమ్మ

తిరువూరు తాలూకా గంపలగూడెం వాసి 1930లో ఉప్పు సత్యాగ్రహంలో కారాగారశిక్ష పొందారు.

## 14. అరికెపూడి మాణిక్యాంబ

గుడివాడ దరి అంగలూరు వాసి. బ్రహ్మయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు 2-5-1932 నుండి వెల్లూరు జైల్లో ఒక సంవత్సరం శిక్షపొందారు.

## 15. మనోరమ

గన్నవరం తాలూకా ముదునూరు వాసి గోపరాజు రామచంద్రరావు (గోరా) గారి కుమార్తె అర్జునరావు గారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని

25-4-1944 నుండి 6 నెలలు జైల్లో కఠినశిక్ష ననుభవించారు. గుడివాడలో హరిజన బాలికల హాస్టలుకు మేనేజరుగా పనిచేసారు.

## 16. వల్లభనేని సీతామహలక్ష్మమ్మ

గుడ్లవల్లేరులో 12-1-1910లో జన్మించారు. గుడివాడ తాలూకా జమీగొల్లపల్లిలో పొట్లూరి వెంకయ్యగారి కుమార్తె. రామబ్రహ్మంగారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు జైల్లో 2-5-1932 నుండి 1 సంవత్సరం కఠిన శిక్ష. 1937 నుండి 1947 వరకు కృష్ణాజిల్లా మహిళా సభకు అధ్యక్షురాలుగా పనిచేసారు. 1946-51 మధ్య ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఎం.ఎల్.ఏ.గా సేవలందించారు.

## 17. గుత్తికొండ సీతమ్మ

దివి తాలూకా చినకళ్ళేపల్లి వాసి. అచ్చయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు జైల్లో 31-8-1932 నుండి 1 సంవత్సరం కఠినశిక్షపొందారు. భట్లపెనుమర్రు గ్రామంలో ప్రభుత్వాధీనంలోనికి వెళ్ళిన కాంగ్రెసు కార్యాలయానికి మరొక ముగ్గురు స్త్రీలతో కలిసి తిరిగి స్వాధీనం చేసుకున్న ధైర్యవంతురాలు.

## 18. కొల్లిపర సీతమ్మ

కృష్ణాజిల్లా వాసి. వెంకయ్యగారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో అవనిగడ్డ స్టేషనరీ సబ్ మేజిస్ట్రేటు తీర్పు మేరకు 31-8-1932 నుండి 1 సంవత్సరము వెల్లూరు జైల్లో కఠిన శిక్షపొందారు.

## 19. వారణాసి సీతమ్మ

కృష్ణాజిల్లా వాసి. శాసనోల్లంఘనకు 3 నెలలు కారాగార శిక్షపొందారు.

## 20. నూతక్కి సీతారామమ్మ

1914లో జన్మించి 1934లో మరణించారు. గుడివాడ తాలూకా కొమరవోలు వాసి. గోపాలకృష్ణయ్య భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు జైలులో శిశువుకు జన్మనిచ్చి అస్వస్థురాలయింది.

## 21. గుళ్ళపల్లి సీతారామమ్మ

విజయవాడ తాలూకా గొడపర్రులో వెంకయ్యగారి పుత్రిక. వ్యక్తి సత్యాగ్రహం చేస్తూ వెల్లూరులో 3 నెలలు కారాగారశిక్షనందారు.

## 22. సీతంరాజు సీతారామమ్మ

వెంట్రప్రగడలో 3-3-1920లో జన్మించి, 1973 సెప్టెంబరులో మరణించారు. విజయవాడ వాసి. ముళ్ళపూడి వెంకటేశ్వరరావుగారి పుత్రిక. సుబ్బారావు గారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని 4 నెలలు కఠిన కారాగార శిక్ష పొందారు. 1947-55 మధ్య మున్సిపల్ కౌన్సిలరు.

## 23. తంగిరాల సీతారామమ్మ

బందరు వాసి. జె. గోపాలకృష్ణయ్యగారి కుమార్తె. వీరరాఘవరావు (స్వాతంత్ర్య సమరవీరుడు) గారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరులో 7 నెలలు కారాగార శిక్షను పొందారు.

## 24. పాదుర్తి సుందరమ్మ

విజయవాడ వాసి. మద్ది లక్ష్మీనరసింహం గారి కుమార్తె. వెంకట సుబ్బయ్యగారి భార్య. ఉప్పు సత్యాగ్రహంలో వెల్లూరు జైల్లో 26-8-1930లో నుండి 6 నెలలు కఠినశిక్ష పొందారు. మరల 1931లో గుంటూరు కాలేజి వద్ద పికెటింగుచేసి, 17 రోజులు కారాగారశిక్షనొందారు. కరాచి, బొంబాయి, మద్రాసు, హైద్రాబాదు, నాగపూర్ కాంగ్రెసు మహాసభలకు హాజరయ్యారు. శాసనోల్లంఘనోద్యంలో పాల్గొని 2-2-1932 నుండి ఏడున్నర నెలలు కఠిన కారాగారశిక్ష పొందారు. విజయవాడలో స్వదేశీవస్తువుల షాపును నెలకొల్పారు. చాలాకాలం మున్సిపల్ కౌన్సిలర్‌గా చేసారు.

## 25. పునూరి సుందరమ్మ

నందివాడ వాసి వెంకటరెడ్డి గారి భార్య. శాసనోల్లంఘనకు 27-6-1932 నుండి సంవత్సరము వెల్లూరులో కఠిన కారాగార శిక్షపొందారు.

# గుంటూరు జిల్లా సమరవీర వనితలు

## జిల్లా ప్రత్యేకతలు

గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వావిలాల వారి కుటుంబం నుండి ముగ్గురు జైలుపాలయ్యారు. వావిలాల మాణిక్యాంబ, భర్త శ్రీరామశర్మ, మరిది గోపాలకృష్ణయ్య గారలు.

తెనాలి తాలూకా నుండి ఏడుగురు స్త్రీలు జైలు కెళ్ళారు.

రేపల్లె తాలూకాలో పన్నెండు మంది స్త్రీలు జైలుకెళ్ళారు.

మంతెనావారిపాలెం లో ఐదుగురు క్షత్రియకులకాంతలు కారాగార శిక్షననుభవించారు.

దుగ్గిరాల వాసి కోటిపల్లి మాణిక్యమ్మ వ్యవసాయ కూలీ.

ఒకే పేరుగల పండితారాధ్యుల సత్యవతమ్మ అనే ఇద్దరు మహిళలు రేపల్లె నుండి జైలుకెళ్ళారు.

గుంటూరు జిల్లా నుండి ఒకేఒక్క వైశ్యమహిళ – కాళంగి శేషమాంబ జైలు కెళ్ళారు.

గుంటూరు జిల్లాలో వినయాశ్రమం ఉండేది. తెనాలి, రేపల్లె, సత్తెనపల్లి తాలూకాలలో ఉద్యమస్ఫూర్తి ఎక్కువ కలిగి ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో ఎక్కువమంద్రి స్త్రీలు – 59 మంది గుంటూరుజిల్లా నుండి పాల్గొన్నారు. స్త్రీలలో ఎక్కువమంది కమ్మవారే.

పెదనందిపాడు, చీరాల ప్రాంతాలు ఉద్యమకేంద్రాలు. రేపల్లెలో వినయాశ్రమం స్వామి సీతారామ్ నెలకొల్పారు. కన్నెగంటి హనుమంతు నాయకత్వాన అడవిపుల్లరి ఆందోళనసాగింది. 'ఆంధ్రరత్న' దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆధ్వర్యాన చీరాల–పేరాల

ఉద్యమం సాగింది. 'రామదండు'ను నిర్వహించారు. 'మాలపిల్ల' నవలను శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ రచించి ప్రసిద్ధుడయ్యాడు. గుంటూరులో 'శారదానికేతన్' ను ఉన్నవ దంపతులు నిర్వహించారు. ఆ సంస్థ ఈనాటికీ నడుస్తోంది. వారుభయులూ సమరయోధులే. ఆచార్య ఎన్జీరంగా నాయకత్వంలో రైతులనేకులు సమరంలో పాల్గొన్నారు. అమరావతి ప్రసిద్ధ పంచారామం. అక్కడే బౌద్ధస్థూపం ఉంది. ఉండవల్లిలో విష్ణుకుండినుల గుహలున్నాయి. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి గదా!

## 1. వాసిరెడ్డి అఖిలాండేశ్వరి

తెనాలి తాలూకా చేబ్రోలు వాసి. దేవభక్తుని భద్రయ్య కుమార్తె. వీరయ్యగారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 10-9-1942 నుండి 16 నెలలు కఠినశిక్ష పొందారు. 15-8-1972న స్వాతంత్ర్య దిన రజతోత్సవంలో భారతప్రభుత్వం నుండి తామ్రపత్రాన్ని పొందారు.

## 2. కొండా అలివేలమ్మ సత్యవతి

24-10-1911న దేచవరంలో రూపనాగుంట్ల సీతారామయ్య గారి కుమార్తెగా జన్మించారు. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని, 20-8-1930 నుండి 6 నెలలు కారాగారశిక్షననుభవించారు. మరల శాసనోల్లంఘనలో పాల్గొని 22-6-1932 నుండి 4 నెలలు వెల్లూరు జైల్లో శిక్షననుభవించారు.

## 3. చిట్టూరి అన్నపూర్ణాదేవి

తెనాలి వాసి. కేసపపుట్టి చిట్టెయ్యగారి కుమార్తె. లక్ష్మీనారాయణగారి భార్య. 17వ ఏటనే క్విట్టిండియా ఉద్యమంలో ఆంగ్లేయ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కరపత్రాలు పంచుతూ సబ్‌కోర్టు ఎదుట పికెటింగు జరిపినందుకు వెల్లూరు జైల్లో సంవత్సరంపాటు కఠినశిక్ష పొందారు.

## 4. మంతెన అన్నపూర్ణమ్మ

1912లో జననం. బాపట్ల మంతెనవారిపాలెం వాసి. వేంకట్రాజు గారి భార్య. 1931లో పికిటింగు చేస్తున్నప్పుడు లాఠీచార్జి, సబ్ జైలుశిక్ష అనుభవించారు. 3 సార్లు సబ్ జైలుశిక్ష పొందారు. భర్త వెంకట్రాజు అనేక రాజకీయ శిక్షణా శిబిరాలు నిర్వహించారు. శాసనసభ్యునిగా పనిచేసారు.

## 5. పాటిబండ్ల అన్నపూర్ణమ్మ

చేబ్రోలులో వాసిరెడ్డి మాధవయ్యగారి కుమార్తె, లింగయ్య గారి భార్య. 1932లో శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని, 3 సార్లు అరెస్టయి, వెల్లూరు జైల్లో 16-3-1933 నుండి 4 నెలలు శిక్షపొందారు.

## 6. సూర్యదేవర అన్నపూర్ణమ్మ

కృష్ణాజిల్లా నందిగామ దరి వీరులపాడులో 1903లో వాసిరెడ్డి నాగయ్యగారి పుత్రికగా జన్మించారు. తెనాలి దరి చేబ్రోలు వాసి వేంకటప్పయ్య గారి భార్య. 1930లో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని, అరెస్టయ్యారు. 1932లో శాసనోల్లంఘనచేసినందుకు వెల్లూరు జైల్లో సంవత్సరం శిక్షపొందారు. 1940, 1942 ఉద్యమాలలో కూడా పాల్గొన్నారు. 1947-48 లో హైద్రాబాదు విమోచనోద్యమంలో కూడా పాల్గొన్నారు. మహిళావిద్య, గ్రంథాలయోద్యమం లోనూ చురుకైన పాత్ర వీరిది.

## 7. ఉప్పల అన్నపూర్ణమ్మ

బాపట్ల దరి గోళ్ళముడిపాడు. కనగాల రామమూర్తి గారి కుమార్తె. వీరయ్య గారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో వెల్లూరు జైల్లో 15 నెలలు కఠినశిక్ష పొందారు.

## 8. వడ్లమూడి అన్నపూర్ణమ్మ

రేపల్లె వాసి. శాసనోల్లంఘున, క్విట్టిండియా ఉద్యమాలో పాల్గొని శిక్షపొందారు.

## 9. మంతెన అచ్చమ్మ

మంతెనవారిపాలెం వాసి. రామరాజుగారి కుమార్తె. శాసనోల్లంఘునకు వెల్లూరు జైల్లో 22-1-1932 నుండి 6 నెలలు కఠినశిక్షపొందారు.

## 10. మొవ్వ అచ్చమ్మ

కావూరు వాసి. శాసనోల్లంఘునము చేసి జైలోశిక్ష పొందారు.

## 11. సుఖవాసి అచ్చమ్మ

శాసనోల్లంఘున చేసి కారాగారశిక్ష పొందారు.

## 12. వేగేశ్న అచ్చమ్మ

బాపట్ల దరి పిట్టలవారిపాలెం. శాసనోల్లంఘనకు కారాగారశిక్షనను భవించారు.

## 13. తుమ్మల చంద్రమ్మ

కావూరులో నాగెండ్ల శేషయ్యగారి పుత్రిక. బాపయ్యగారి భార్య. ఉప్పు, శాసనోల్లంఘనోద్యమాలలో పాల్గొని, వెల్లూరు జైల్లో 2 సార్లు వేర్వేరుగా ఆరేసి నెలలపాటు కఠినశిక్షపొందారు.

## 14. కొరటాల దుర్గాంబ

తెనాలి దరి నందివెలుగులో ఎం. పున్నయ్య గారి కుమార్తె. కృష్ణయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు, మద్రాసులలో కఠిన కారాగార శిక్షననుభవించారు.

## 15. తుమ్మల దుర్గాంబ

కావూరి వాసి పర్వతనేని కృష్ణయ్యగారి కుమార్తె. బసవయ్యగారి భార్య. ఉప్పు, శాసనోల్లంఘన, క్విట్టిండియా ఉద్యమాలలో పాల్గొని వెల్లూరు జైల్లో మొత్తం 30 నెలలు కఠిన శిక్షలననుభవించారు.

## 16. వేజెండ్ల దుర్గాంబ

రేపల్లె దరి పల్లెకోనలో వడ్లమూడి వరదయ్యగారి కుమార్తె. వేంకటసుబ్బయ్య గారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు జైల్లో 6 నెలలు కఠిన శిక్షపొందారు.

## 17. వెలగలేటి దుర్గమ్మ

తెనాలి వాసి. నూతలపాటి సుబ్బయ్యగారి కుమార్తె. శాసనోల్లంఘన, క్విట్టిండియా ఉద్యమాలలో పాల్గొని, 24 నెలలు వివిధ కాలాలలో శిక్ష పొందారు.

## 18. మంతెన జానకమ్మ

మంతెనవారిపాలెం వాసి. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొన్నారు.

## 19. కోళ్ళ జయలక్ష్మి

పెదనందిపాడు వాసి. త్రిపుర్నేని దూర్వాసులుగారి పుత్రిక. హనుమంతరావు గారి భార్య. హిందీలో విశారద. శాసనోల్లంఘనకు వెల్లూరు జైల్లో సంవత్సరం పాటు శిక్షపొందారు.

## 20. కొడాలి కమలాంబ

తెనాలి దరి మోపర్రు వాసి. గోగినేని రాయకోటయ్య గారి పుత్రిక. కుటుంబ రావుగారి భార్య. వ్యక్తి, క్విట్టిండియా ఉద్యమాలలో పాల్గొని 15 నెలలు కఠిన శిక్షపొందారు.

## 21. ఆవుల లక్ష్మీబాయమ్మ

తెనాలి వాసి. డి. రామయ్య గారి కుమార్తె. శాసనోల్లంఘనకు సంవత్సరం కఠిన శిక్షపొందారు.

## 22. ఉన్నవ లక్ష్మీబాయమ్మ


ఉన్నవ లక్ష్మీబాయమ్మ

సత్తెనపల్లి దరి అమీనాబాదు వాసి. నడింపల్లి సీతారామయ్యగారి కుమార్తె. 'మాలపల్లి' రాసిన ఉన్నవ లక్ష్మీనారాయణగారి సతీమణి. గుంటూరులో ఉభయులూ బాలికావిద్యకోసం 1922లో 'శారదా నికేతన్' స్థాపించారు. సహాయనిరాకరణ, ఉప్పు, వ్యక్తి సత్యాగ్రహాలలో పాల్గొని కారాగార శిక్షల ననుభవించారు. ఆంధ్రదేశం అంతటా పర్యటించి, స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేటట్లు స్త్రీలను ఉద్రూతలూగిస్తూ ఉపన్యాసా లిచ్చారు.

## 23. కోనేరు మంగమ్మ

రేపల్లె నల్లూరి వాసి. భర్త సుబ్బయ్య. శాసనోల్లంఘనకు వెల్లూరులో 24-3-1932 నుండి 6 నెలలు కారాగారశిక్షననుభవించారు.

**24. వావిలాల మాణిక్యాంబ**

సత్తెనపల్లి వాసి. రామశర్మగారి భార్య. వావిలాల గోపాలకృష్ణయ్య గారు రామశర్మ గారి తమ్ముడే. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు వెల్లూరు జైలులో 30-1-1941 నుండి 3 నెలలు కఠిన శిక్షననుభవించారు.

**25. చుక్కపల్లి మాణికమ్మ**

తెనాలి దరి కంచర్లపాలెం వాసి. బొల్లినేని కోటయ్యగారి పుత్రిక. భర్త చుక్కపల్లి కోటయ్య. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొన్నందుకు వెల్లూరు, కడలూరు జైళ్ళలో 30-1-1941 నుండి 3 నెలలు శిక్షపొందారు. తిరిగి క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు 30-9-1942 నుండి 3 నెలలు కఠినశిక్ష పొందారు.

**26. కోటిపల్లి మాణిక్యమ్మ**

జననం 13-9-1926 దుగ్గిరాల వాసి. వేంకటప్పయ్య గారి పుత్రిక. రామయ్యగారి భార్య. వ్యవసాయ కూలి. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు 12-1-1943 నుండి వెల్లూరు జైల్లో 3 నెలలు కఠినశిక్ష పొందారు.

**27. కొల్లి నాగభూషణం**

రేపల్లె దరి నల్లూరి వాసి. టి. అప్పారావు కుమార్తె. నారాయణగారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు, మద్రాసు జైళ్ళల్లో 29-3-1932 నుండి 6 నెలలు కఠిన శిక్షననుభవించారు.

**28. వట్టికూటి రాధాకృష్ణమ్మ**

వేటపాలెం వాసి. రావిపాటి నాగయ్య గారి కుమార్తె. శాసనల్లోంఘనకు వెల్లూరు జైల్లో 11-5-1932 నుండి 6 నెలలు కఠినశిక్షననుభవించారు.

**29. గడ్డిపాటి రాఘవమ్మ**

కొవ్వూరి వాసి. తుమ్మల పున్నయ్యగారి కూతురు. వేంకటరత్నంగారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని వెల్లూరులో 23-9-1932 నుండి 6 నెలలు కఠిన శిక్షనొందారు.

**30. సూర్యదేవర రాధాకృష్ణమ్మ**

చేబ్రోలు వాసి. పుతుంబాక పున్నయ్యగారి పుత్రిక, సీతారామయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు, మద్రాసు జైళ్ళల్లో 26-1-1932 నుండి 14 నెలలు కఠినశిక్షననుభవించారు.

**31. మునగపాటి రాధాకృష్ణమ్మ**

మునగపాడు వాసి. శాసనోల్లంఘనకు 8 నెలలు కఠిన కారాగార శిక్షపొందారు.

**32. కానూరు రాజ్యలక్ష్మమ్మ**

రేపల్లె దరి వోలేరు వాసి. 1932లో శాసనోల్లంఘనకు 6 నెలలు కఠిన కారాగార శిక్ష నొందారు.

**33. బసవరాజు రాజ్యలక్ష్మి**

గుంటూరు వాసి. అప్పారావు (కవి) గారి భార్య. ఉపాధ్యాయిని. వ్యక్తిసత్యాగ్రహంలో పాల్గొని 3-2-1941 నుండి 2 నెలలు వెల్లూరు, కడలూరు జైళ్ళల్లో కఠినశిక్షపొందారు.

**34. గొళ్ళమూడి రత్నమ్మ**

చేబ్రోలు వాసి. వాసిరెడ్డి సాంబయ్యగారి పుత్రిక. చంద్రమౌళిగారి భార్య. 1930 ఉప్పుసత్యాగ్రహంలో 6 నెలలు 1932లో శాసనోల్లంఘనకు 6 నెలలు, 1942లో క్విట్టిండియా ఉద్యమంలో 6 నెలలు కారాగార శిక్షల ననుభవించారు. హరిజన, గ్రంథాలయోద్యమాలలో తీవ్రకృషిసల్పారు.

**35. కొల్లి రత్నమ్మ**

రేపల్లె దరి సింగుపాలెం వాసి. టి. వెంకయ్యగారి కుమార్తె. బ్రహ్మయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు సంవత్సరం శిక్షపొందారు.

**36. యార్లగడ్డ రత్నమ్మ**

రేపల్లె దరి పల్లెకోన వాసి. వేజెండ్ల కోటయ్య గారి కుమార్తె. శేషయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు 6 నెలలు కఠిన కారాగారశిక్షపొందారు. 27-9-1947లో మరణించారు.

**37. యనమదల రత్నమ్మ**

రేపల్లె దరి తూర్పుపాలెం. సజ్జా కోటయ్యగారి కుమార్తె. అప్పయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు 6 నెలలు కఠినకారాగార శిక్షపొందారు.

**38. శాంతకుమారి**

తెనాలి వాసి డా. శ్యామ్‌చంద్‌గారి కుమార్తె. పండిత మదనమోహన్ విద్యాలంకార్ ధర్మపత్ని. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, వెల్లూరు జైల్లో సంవత్సరం పాటు కఠినశిక్షపొందారు.

**39. యలమంచిలి సరళాకుమారి**

రేపల్లె దరి మైనేనివారిపాలెం వాసి. అంకయ్యగారి కుమార్తె. శాసనోల్లంఘనకు 6 నెలలు కారాగార శిక్షపొందారు.

**40. యలవర్తి సత్యజ్ఞానప్రసన్నాంబ**

నగరం వాసి. పి. వెంకట్రామయ్యగారి కుమార్తె. గోవిందయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు 6 నెలలు కారాగార శిక్షపొందారు.

**41. పండితారాధ్యుల సత్యవతమ్మ**

రేపల్లెవాసి పోతరాజు శ్రీరాములు గారి కుమార్తె. హనుమంతరావు గారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో 6 నెలలు కఠినకారాగార శిక్షపొందారు.

**42. వల్లూరు సావిత్రీదేవి**

తెనాలి వాసి. కృష్ణయ్యగారి కుమార్తె. బలరామరాజు గారి భార్య శాసనోల్లంఘనకు 10 నెలలు కారాగార శిక్షపొందారు.

**43. కాళంగి శేషమాంబ**

నర్సరావుపేట మాజేటి శ్రీరాములు గారి కుమార్తె. నరసింహారావు గారి భార్య. శాసనోల్లంఘనకు వెల్లూరు జైలులో 1 సంవత్సరం కఠిన కారాగార శిక్షపొందారు. 13-10-1953న మరణించారు.

**44. యల్లేపెద్ది శేషమాంబ**

నల్లూరు వాసి వై. రత్నయ్యగారి కుమార్తె. వేంకటరత్నం గారి భార్య. శాసనోల్లంఘనకు 6 నెలలు కఠిన కారాగారశిక్షననుభవించారు.

**45. పెనుమర్తి శేషమాంబ**

తెనాలి తాలూకా పోతుమర్రు వాసి. మంత్రవాది లక్ష్మయ్య గారి పుత్రిక. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, 16 నెలల కఠిన కారాగార శిక్షపొందారు. హిందీభాషా ప్రచారం బాగా చేసారు.

**46. సుఖవాసి శేషమ్మ**

కావూరు వాసి. కె. కొండయ్యగారి కుమార్తె. గురవయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు 6 నెలలు కఠిన కారాగారశిక్ష ననుభవించారు.

**47. యలవర్తి శేషమ్మ**

కావూరి వాసి. శాసనోల్లంఘనకు కారాగారశిక్షపొందారు.

**48. బొప్పూడి సీతారామమ్మ**

పమిడిపర్రు వాసి. కొల్లి అప్పయ్యగారి కుమార్తె. కోటయ్య గారి భార్య. శాసనోల్లంఘనకు 10 నెలలు కారాగారశిక్షపొందారు.

**49. కొర్రపాటి సీతారామమ్మ**

రేపల్లె తాలూకా బలసులపాలెం వాసి. సాంబయ్యగారి కుమార్తె. శాసనోల్లంఘనకు 6 నెలలు కారాగారశిక్ష పొందారు.

**50. నాదెళ్ళ సీతారామమ్మ**

గుత్తావారిపాలెం వాసి పర్చూరు రామయ్యగారి కుమార్తె. రామయ్య గారి భార్య. శాసనోల్లంఘనకు 6 నెలలు కఠిన కారాగారశిక్షపొందారు.

**51. దంతులూరి సుబ్బమ్మ**

మంతనెనవారిపాలెం వాసి. మంతెన బాపిరాజు గారి పుత్రిక. శాసనోల్లంఘనకు 6 నెలలు కారాగారశిక్షపొందారు.

**52. గుత్తా సుందరమ్మ**

రేపల్లె దరి పెదపులివర్రు వాసి. కొత్తపల్లి అచ్చయ్య కుమార్తె. చలమయ్యగారి భార్య. శాసనోల్లంఘనకు 1 సంవత్సరం కఠినకారాగార శిక్షపొందారు.

**53. తుమ్మల తులశమ్మ**

కావూరి వాసి నాగళ్ళ మౌళయ్యగారి కుమార్తె. అప్పారావు గారి భార్య. ఉప్పు సత్యాగ్రహంలో కారాగారశిక్షనొందారు. శాసనోల్లంఘనకు 6 నెలలు కఠిన కారాగార శిక్షపొందారు.

జననం 1912, మరణం 1932

**54. ఆరమండ్ల ఉషాదేవి**

తెనాలి తాలూకా కూచినపూడి వాసి. జాస్తి శ్రీరాములు గారి కుమార్తె. మునీశ్వరరావు గారి భార్య. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, వెల్లూరు జైల్లో 15 నెలలు కఠిన శిక్షపొందారు. 1946లో చనిపోయారు.

**55. గట్టు వెంకమ్మ**

పమిడిమర్రు వాసి. శాసనోల్లంఘనకు కారాగారశిక్షపొందారు.

**56. కాంచనపల్లి వెంకమ్మ**

పల్నాడు తూలూకా వాసి. సహాయనిరాకరణకు 4 నెలలు రాజమహేంద్రి జైల్లో కఠినశిక్ష పొందారు.

**57. మోటమర్తి వెంకటనాగలక్ష్మి**

తెనాలి దరి ఇంటూరు వాసి. కనకదుర్గాప్రసాద్ గారి భార్య. వ్యక్తి సత్యాగ్రహంలో శిక్షపొందారు.

# ప్రకాశం జిల్లా సమరయోధులు

## జిల్లా ప్రత్యేకతలు

గుంటూరు, నెల్లూరు, కర్నూలు జిల్లాల భాగాలను విడదీసి ప్రకాశం జిల్లాగా ఏర్పాటు చేసారు. కవిత్రయంలోని యర్రాప్రగడ ఈ జిల్లావాసి. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి జన్మస్థలం ఒంగోలుకు 20 కి.మీ. లోని వినోదరాయుడు పాలెం. కొత్త జిల్లాకు ప్రకాశంజిల్లా అని నామకరణం చేసిన వారు శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి. జిల్లాకు ఒక వైపు సముద్రం.

## 1. పీసుపాటి త్రిపురాంబ

చీరాల వాసి. వేంకట నరసింహం గారి భార్య. శాసనోల్లంఘనోద్యమంలో వెల్లూరు జైల్లో 7 నెలలు శిక్షననుభవించారు.

## 2. కోట సుందరమ్మ

అద్దంకి వాసి. 1921-22 సంవత్సరంలో పన్ను నిరాకరణోద్యమంలో పాల్గొన్నప్పుడు తాసిల్దారు ఆమె మంగళసూత్రాన్ని పన్నుకు జమకట్టాడు.

# నెల్లూరు జిల్లా సమరయోధులు

## జిల్లా ప్రత్యేకతలు

నెల్లూరు జిల్లాలో కోవూరు సమీపంలోని గోగులాపల్లి అను మారుమూల గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు శాసనోల్లంఘనోద్యమంలో 6నెలలపాటు కఠినకారాగారశిక్షననుభవించారు. ఆ గడ్డమహత్తు అటువంటిదన్నమాట! జిల్లాకు ఒకవైపు పినాకిని తీరంలో పల్లెపాడులో సముద్రం వద్ద ఆశ్రమం ఉంది. శ్రీ వెన్నెలగంటి రాఘవయ్యను యానాది రాఘవయ్య అనే వారు, యానాదిజాతికి చేసిన సేవలవల్ల ఆపేరొచ్చింది. అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. 1946లో మద్రాసులో ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు గారి మంత్రివర్గంలో పార్లమెంటరీ సెక్రటరీగా పనిచేసారు. తిక్కన ఇక్కడివాడే. నెల్లూరులోని శ్రీ రంగనాథ స్వామి వారి దేవాలయం అతిప్రాచీనమైనది. జిల్లాలో ముఖ్యనది పెన్నా. కోస్తాంధ్ర నెల్లూరు నుండి శ్రీకాకుళం వరకు ఉంది.

### 1. పాటూరు బాలసరస్వతమ్మ

నెల్లూరు వాస్తవ్యులు 1900 సంవత్సరంలో జననం. భర్త సుబ్బరామయ్య. విప్లవోద్యమంలోను, 1920-21 నాటి సహాయనిరాకణోద్యమంలోను చురుకుగా పనిచేసారు. 'సింహపురి' అను వారపత్రికను కొంతకాలం భర్తతో కల్సి నడిపారు. 1930-32 ఉద్యమాలలో పనిచేసి కారాగారశిక్షననుభవించారు. 'శశి' అను మాసపత్రికను నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్‌గా సేవలందించారు. 14-9-1975న స్వర్గస్థులయ్యారు.

## 2. వేనాటి చెంచులక్ష్మమ్మ

వరకవిపూడి వాస్తవ్యులు. భర్త శ్రీ పోలారెడ్డి. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 8-2-1932 నుండి 6 నెలలుపాటు కఠినకారాగారశిక్ష ననుభవించారు.

## 3. ముత్తుకూరు కామమ్మ

నెల్లూరు వాస్తవ్యులు. నరసింహయ్యగారి పుత్రిక. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని 30-6-1930 నుండి 6 నెలలపాటు కఠినకారాగారశిక్ష ననుభవించారు. శాసనోల్లంఘనోద్యమంలో 16-3-1932 నుండి 4 నెలలపాటు వెల్లూరు, కన్ననూరు కారాగారాలలో శిక్షననుభవించారు.

## 4. పొణకా కనకమ్మ


పొణకా కనకమ్మ

జననం 1896. తండ్రి మరుపూరు కొండారెడ్డి. భర్త సుందరరామిరెడ్డి. కవయిత్రి. వందేమాతరం, ఉప్పు, శాసనోల్లంఘనోద్యమాలలో పాల్గొని కారాగారశిక్షల ననుభవించారు. గ్రంథాలయోద్యంలో చురుకైన పాత్ర వీరిది. 1923 కాకినాడ కాంగ్రెసులో మహిళల విభాగానికి నాయకత్వం వహించారు. నెల్లూరు జిల్లా కాంగ్రెసుకు తొలి మహిళా అధ్యక్షురాలు. రాష్ట్ర కాంగ్రెసు ఉపాధ్యక్షురాలుగా, ఏ.ఐ.సి.సి. మెంబరుగా పనిచేసారు. స్త్రీ విద్య, సంఘసంస్కరణ కార్యక్రమాలలో చురుకైన పాత్ర వీరిది. నెల్లూరులో కస్తూరిబా స్మారక బాలికల పాఠశాలను స్థాపించారు.

## 5. బెజవాడ లక్ష్మీకాన్తమ్మ

జననం 4-2-1921. బుచ్చిరెడ్డిపాలెం వాస్తవ్యురాలు. తిక్కవరపు రామిరెడ్డి గారి పుత్రిక, బెజవాడ గోపాలరెడ్డి గారి ధర్మపత్ని. శాంతినికేతన్‌లతో విద్యాభ్యాసం. వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని వెల్లూరు జైల్లో శిక్షనుభవించారు.

## 6. ఓరుగంటి మహాలక్ష్మమ్మ

జననం 1885. కావలి వాస్తవ్యురాలు. తండ్రి తూములూరి శివకామయ్య. భర్త వేంకటసుబ్బయ్య. సహాయ నిరాకరణ, విదేశీవస్త్రదహనం, ఖాదీ, మద్యపానవ్యతిరేక, ఉప్పుసత్యాగ్రహాలలో పాల్గొని, కఠినకారాగార శిక్షల ననుభవించారు. మరణం 1945.

## 7. చవ్వాకుల మైత్రేయి



చవ్వాకుల మైత్రేయి

నెల్లూరు వాస్తవ్యులైన ఓరుగంటి వేంకట సుబ్బయ్య గారి కుమార్తె. తన దేశభక్తి గేయాలతో విదేశీ వస్త్రబహిష్కరణ, శాసనధిక్కరణోద్యమాలకు ప్రజలను ఉద్రూత లూగించారు.

## 8. కూరపాటి మంగళాంబ

నెల్లూరు వాస్తవ్యులైన కృష్ణారావుగారి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని వెల్లూరు జైల్లో 21-3-1932 నుండి 6 నెలలు శిక్షననుభవించారు.

## 9. పల్లా ఓబులమ్మ

నెల్లూరు జిల్లా కోవూరు దరి గోగులపల్లి. తండ్రి వేంకటస్వామిరెడ్డి. శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని 11-10-1932 నుండి 6 నెలలు పాటు వెల్లూరు, కన్ననూరు జైళ్ళల్లో శిక్షలననుభవించారు.

## 10. గుడి పిచ్చమ్మ

కోవూరు దరి గోగులాపల్లి వాస్తవ్యురాలు. తండ్రి పాపిరెడ్డి. శాసనోల్లంఘ నోద్యమంలో పాల్గొని, వెల్లూరు, కన్ననూరు జైళ్ళల్లో 11-1-01932 నుండి 6 నెలల పాటు శిక్షననుభవించారు.

## 11. గుడి పోలమ్మ

కోవూరు దరి గోగులాపల్లికి చెందిన అయ్యపరెడ్డి పుత్రిక. శాసనోల్లంఘ నోద్యమంలో పాల్గొని, వెల్లూరు, కన్ననూరు జైళ్ళల్లో 11-10-1932నుండి 6 నెలలపాటు శిక్షననుభవించారు.

**12. పినకటి పోలమ్మ**

గోగులాపల్లికి చెందిన రంగయ్య పుత్రిక. శాసనోల్లంఘనోద్యమంలో 6 నెలల పాటు కఠినకారాగారవాసమనుభవించారు.

**13. ద్వారం పుల్లమ్మ**

గోగులాపల్లి వాస్తవ్యులైన ఎల్లారెడ్డి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో 6 నెలల పాటు కఠినకారాగారవాసమనుభవించారు.

**14. దుర్భా రమణమ్మ**

నెల్లూరు వాసి. వేంకటరామయ్య పుత్రిక. శాసనోల్లంఘనోద్యమంలో 6 నెలల పాటు కఠిన శిక్షపొందారు.

**15. పొన్నలూరు రమణమ్మ**

నెల్లూరు వాసి వెంకటరామయ్యగారి పుత్రిక. శాసనోల్లంఘనోద్యమంలో 6 నెలల పాటు కఠినకారాగారశిక్షనొందారు.

**16. కావేటి రమాతిలకమ్మ**

వేంకటగిరిలో 26-1-1943న స్వాతంత్ర్యదిన ఊరేగింపునకు నాయకత్వం, శిక్ష.

**17. కోబాక రుక్మిణమ్మ**

వేంకటగిరిలో సుబ్బయ్యగారి భార్య. వ్యక్తి సత్యాగ్రహంలో 1941లో 3 నెలల పాటు శిక్షననుభవించారు.

**18. పి.డి. సామ్రాజ్యం**

కావలి తాలూకా వాసి. తాటిచెట్లునుండి కల్లుగీయడానికి వ్యతిరేకించారు. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, శిక్షననుభవించారు.

**19. చీల సరోజిని**

వేంకటగిరిలో 26-1-1943న స్వాతంత్ర్యదిన ఊరేగింపులో పాల్గొన్నారు. శిక్ష.

## 20. రామలింగం సుబ్బమ్మ

గోగులాపల్లికి చెందిన సుబ్బారెడ్డి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో 6 నెలలపాటు కఠినకారాగారశిక్షననుభవించారు.

## 21. తిక్కవరపు సుందరమ్మ

నెల్లూరు వాసి రామిరెడ్డి భార్య. భర్త సహాయ నిరాకరణోద్యమంలో జైలుకు వెళ్ళినప్పుడు, ఆ ఉద్యమాన్ని కొనసాగించారు. నెల్లూరులో ఇంటింటికి వెళ్ళి విదేశీ దుస్తులను సేకరించి, అగ్నికి ఆహుతి చేసింది. హరిజనోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. లిక్కరు షాపుల వద్ద పికెటింగు జరిపారు. 1936లో మరణించారు.

## 22. బుత్తారం సుందరమ్మ

నెల్లూరులో పిచ్చయ్యగారి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో 6 నెలలు శిక్షననుభవించారు.

## 23. సుబ్బవరపు తాయారమ్మ

నెల్లూరు వాసి పొన్నలూరు రామయ్య కుమార్తె. 1930లో శాసనోల్లంఘ నోద్యమంలో 6 నెలలపాటు శిక్షననుభవించారు.

## 24. చవనం తిరుపతమ్మ

గోగులాపల్లికి చెందిన సుబ్బారెడ్డి కుమార్తె. శాసనోల్లంఘనోద్యమంలో 2 సార్లు కఠిన కారాగార శిక్షననుభవించారు.

## 25. తిరుపతమ్మ

నెల్లూరులో శాసనధిక్కారం చేసినందుకు శిక్ష.

## 26. రెంటాల వేంకటసుబ్బమ్మ

పినాకినీ తీరాన పల్లిపాడుకి చెందిన వేంకట కృష్ణయ్య భార్య. శాసనోల్లంఘ నోద్యమంలో 6 నెలలపాటు కఠినకారాగారశిక్షననుభవించారు.

# అనంతపురం జిల్లా సమరయోధులు

**1. ఇల్లూరు కేసమ్మ**

అనంతపురం దరి ఇల్లూరులో 1922లో జన్మించారు. నర్సప్పగారి కుమార్తె. క్విట్టిండియా ఉద్యమంలో పాల్గొని, వెల్లూరు జైల్లో 2-10-1942 నుండి రెండు నెలలు కఠినశిక్షపొందారు.

# వరంగల్లు జిల్లా సమరయోధులు

**1. కొర్రా బుచ్చమ్మ**

జనగాం తాలూకా బహరానాపల్లి వాసి. మల్లయ్య కుమార్తె. నైజాం వ్యతిరేకోద్యమంలో 25-8-1948 రజాకార్లు, నిజాం పోలీసులు గ్రామంపై జరిపిన కాల్పులలో అక్కడికక్కడే మరణించింది.

# చిత్తూరు జిల్లా సమరయోధులు

## 1. తంబళంపల్లి నల్లప్పరెడ్డి శకుంతల

జననం 1927. మదనపల్లి తాలూకా తంబళంపల్లి వాసి. తిక్కవరపు రామిరెడ్డి గారి పుత్రిక. కృష్ణారెడ్డిగారి భార్య. 1943లో మద్రాసు క్వీన్‌మేరీ కళాశాలలో విద్యనభ్యసిస్తుండగానే, మద్రాసులోని అన్ని కళాశాలలకు సంఘటితపరచి, విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించారు. ఎగ్మూరు మేజిస్ట్రేటు ఎదుట పికెటింగు జరపడంవల్ల వెల్లూరు జైల్లో 6 నెలలు శిక్షపొందారు.

**ప్రత్యేకతలు :**

అనంతపురం, చిత్తూరు జిల్లాలనుండి ఒక్కొక్కరు మాత్రమే స్త్రీలు జైలుకెళ్ళారు. కడప, కర్నూలు జిల్లాలనుండి ఎవ్వరూ లేరు! ఈ జిల్లాలను రాయలసీమ అంటారు. అనంతపురం జిల్లాలో శ్రీ పప్పూరు రామాచార్యులు, శ్రీ కల్లూరు సుబ్బారావు సమరానికి నాయకత్వం వహించారు. జైలుశిక్షననుభవించిన శ్రీ నీలం సంజీవరెడ్డి రాష్ట్రపతి పదవిని పొందడం విశేషం. కర్ణాటక సరిహద్దు రాష్ట్రం. జిల్లాలో కదిరి గొప్ప నరసింహక్షేత్రం. ముఠా, హత్యారాజకీయాల వల్ల ఎక్కువమంది సమరవీరులు కాలేదనిపిస్తుంది.

చిత్తూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతి, స్వర్ణముఖీనది ప్రధానమైనది. సమరంలోకి ఎక్కువమంది వెళ్ళలేదు. తమిళనాడు, కర్ణాటక సరిహద్దులు.

కర్నూలు జిల్లాలో ఎక్కువమంది పురుషులు సమరంలోకి దూకారు. శ్రీశైలం, మహానంది, అహోబిలం, యాగంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలు. తుంగభద్ర ప్రధానమైన నది.

# హైద్రాబాదు జిల్లా సమరయోధులు

## జిల్లా ప్రత్యేకతలు

హైద్రాబాదునుండి ముగ్గురు. నల్గొండ నుండి ఒకరు, వరంగల్లు జిల్లానుండి ఒక్కరు మాత్రం స్త్రీలు జైలుకెళ్ళారు. అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలనుండి ఎవ్వరూ జైలుకు వెళ్ళలేదు. ఈ జిల్లాలన్నీ కలిపి తెలంగాణా అంటారు. నిజాం వ్యతిరేకోద్యమంలో పాల్గొన్న వారంతా సమరయోధులేనని కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అప్పట్లో అది మిక్కిలి వెనుకబడిన ప్రాంతమే. ఐతే పురుషులెక్కువ మంది సమరంలో పాల్గొన్నారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృషాణరావు, పి.వి. నరసింహారావు, కాళోజీ, దాశరథి ప్రభృతులు నాయకత్వం వహించారు ప్రధాని పి.వి. నరసింహారావు దేశంలో తొలి తెలుగు వ్యక్తి.

## 1. సంగం లక్ష్మీబాయి



సంగం లక్ష్మీబాయ్

1911లో ఘట్‌కేసర్‌లో జన్మించారు. డి. రామయ్య గారి పుత్రిక. 1926లో గుంటూరులో శారదానికేతన్ స్కూల్ నుండి తెలుగు, సంస్కృతంలో 'విదుషీమణి' పొందారు. చిత్రకళలో డిప్లొమా, 1942లో కార్వే (పూనా) విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రత పొందారు. 1928లో సైమన్ వ్యతిరేకోద్యమంలో, ఉప్పుసత్యాగ్రహంలో వెల్లూరు జైల్లో 1 సంవత్సరం కారాగార పొందారు. 1932లో గాంధీజీతో నిరాహారదీక్షలో పాల్గొన్నారు. స్వదేశీ ఉద్యమంలో

చురుకైన పాత్ర, విదేశీవస్తువులను బహిష్కరించడం జరిగింది. 1951లో తెలంగాణాలో భూదాన యజ్ఞంలో ఆచార్య వినోబాభావేతో పర్యటించారు. 1952లో హైదరాబాదులో 'ఇందిరాసదన్' ప్రారంభించి అనాథ స్త్రీలకు ఆశ్రయం కల్పించారు. డా. బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వంలో 1954-56 మధ్య విద్యాశాఖ ఉపమంత్రిగా పనిచేసారు. 1957-71 మధ్య లోక్‌సభ సభ్యురాలు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నందుకు భారత ప్రభుత్వం 'తామ్రపత్రం'తో సత్కరించారు.

## 2. పద్మజానాయుడు


పద్మజానాయుడు

హైదరాబాదులో 17-11-1900న జన్మించారు. తల్లిదండ్రులు సరోజినీ నాయుడు, మేజర్ ఎమ్. గోవిందరాజులునాయుడు. చిన్ననాడే గాంధీజీ ప్రభావం ఎక్కువగా ఉంది. 1920లో తిలక్ స్వరాజ్య నిధికి విరాళాలు సేకరించారు. భారత జాతీయ కాంగ్రెసు హైద్రాబాదు శాఖ స్థాపకులలో ఒకరు. 1929లో హైద్రాబాదు ప్లేగు నివారణ సంఘాన్ని స్థాపించారు.

2-1-01942న క్విట్టిండియా ఉద్యమంలో అరెస్ట్‌అయ్యారు. 1947-48 మధ్య హైద్రాబాదు రజాకార్ ఉద్యమం సందర్భంలో జరిపిన దుశ్చర్యలను కండ్లకు కట్టినట్లుగా నివేదికను రూపొందించారు. ఇండియన్ కాన్ఫరెన్స్ ఆఫ్ సోషల్ వర్క్ హైద్రాబాదు శాఖను నెలకొల్పారు. 1950-52 మధ్య భారత రాజ్యాంగ పరిషద్ సభ్యురాలు. 1956-67 మధ్య పశ్చిమబెంగాల్ గవర్నరుగా పనిచేసారు. 'పద్మవిభూషణ్' బిరుదాన్ని పొందారు. న్యూఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ స్మారక మ్యూజియం, లైబ్రరీకి ఛైర్మన్‌గా, నెహ్రూ స్మారక నిధి ఛైర్‌పర్సన్‌గా పనిచేసారు. 2-5-1975లో ఢిల్లీలో మరణించారు.

## 3. సుమిత్రాదేవి

హైద్రాబాదులో 9-10-1918న జన్మించారు, దేవీప్రసాద్‌భార్య. ఆర్య సత్యాగ్రహ సమితి తరపున 1938లో సివిల్ లిబర్టీస్ ఉద్యమంలో పాల్గొని,

కారాగారశిక్ష పొందారు. ఇండియన్ యూనియన్ విలీనోద్యంలో చురుకుగా పాల్గొన్నారు. హైద్రాబాదులో పెక్కు ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పారు. హైద్రాబాదు దళిత జాతి సంఘు కార్యదర్శి, ఖాదీ ప్రచార సంఘాలను, చర్కాసంఘాలను ఏర్పాటు చేసారు. 1957 నుండి 1978 వరకు శాసనసభ్యురాలు. పెద్ద ఉప్పల్‌లో బాపూజి సేవా సదన్, అనాథాశ్రమాన్ని స్థాపించారు.

# నల్గొండ జిల్లా సమరయోధులు

## 1. ఆరుట్ల కమలాదేవి

1921లో భోనగిరి తాలూకా మంత్రపురిలో జననం. హైద్రాబాదు వాసి. రామచంద్రారెడ్డి భార్య. విద్యార్థినిగా ఉండగా ఆర్య సమాజం కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. 1942–44 మధ్య హైద్రాబాదు మహిళా సమాజం ప్రధాన కార్యదర్శి, తెలంగాణాలో రాజరిక వ్యతిరేక కార్యక్రమంలో రహస్యంగా తన పాత్ర నిర్వహించారు. రజాకార్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా స్త్రీలలో సాయుధ గెరిల్లా యుద్ధానికి నాయకత్వం వహించారు. ఆమె ఇంటిని రజాకార్లు దోపిడీ చేసారు. 1952–56 మధ్య హైద్రాబాదులో రాష్ట్రశాసనసభకు 1957–67 మధ్య ఆంధ్రప్రదేశ్ శాసనసభలోను సభ్యురాలిగా గంభీరోపన్యాసా లిచ్చారు.

## 2. మల్లు స్వరాజ్యం

సూర్యాపేట తాలూకా, కాథ్విరాల కొత్తగూడెంలో 1931లో జన్మించారు. భీమిరెడ్డి రామిరెడ్డి గారి పుత్రిక, వెంకటనరసింహారెడ్డి గారి భార్య. మార్క్సిస్టు కార్యకలాపాలలో చురుకైన పాత్ర పోషించారు. 1945–48మధ్య నైజాం, రజాకార్ల వ్యతిరేకపోరాటాన్ని రహస్యంగా నడిపారు. ఆమె ఇంటిని రజాకార్లు తగులపెట్టారు. రాష్ట్రమహిళా సంఘ సహాయకార్యదర్శిగా, పనిచేసారు. వరంగల్లు, కరీంనగర్, ఆదిలాబాదు జిల్లాల ఆదిమ జాతులవారికి ఎంతో సేవ చేసారు. 1975లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యురాలైనారు.